www.visalaandhra.com

శుక్రవారం
24-02-2023

విజయవాడ ప్రచురణ

సంపుటి : 71, సంచిక : 243
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అమెరికా గజగజ

అమెరికాను మంచుతుపాను గజగజ వణికిస్తోంది. పశ్చిమ తీరం నుంచి గ్రేట్ లేక్స్ వరకు భారీగా మంచు కురుస్తోంది. రెండు అడుగుల మందంగల మంచు దుప్పటి ఆయా ప్రాంతాలను కప్పేసింది. లక్షలాది ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా వేలాది విమానాలు రద్దయ్యాయి.

2లో

ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

(ఫైల్‌ఫొటో)

- ముగిసిన నామినేషన్ల ఘట్టం
- చివరిరోజు పెద్దసంఖ్యలో దాఖలు చేసిన అభ్యర్థులు
- అనంతపురంలో సినీఫక్కీలో టీడీపీ అభ్యర్థి నామినేషన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల నియోజకవర్గాలకు సంబంధించి గురువారం నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కావడంతో ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల సందడి నెలకొంది. చివరిరోజు అభ్యర్థులు పెద్దసంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తానికి ఈ నెల 16 నుంచి ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణపర్వం గురువారం మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 16 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. టీచర్స్ స్థానానికి సంబంధించి ఆరుగురు అభ్యర్థులు, స్థానిక సంస్థల స్థానానికి సంబంధించి ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పట్టభద్రుల స్థానానికి వైసీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన, ఆమ్‌ఆద్మీ, బీఎస్పీ నుంచి నామినేషన్లు వేశారు. టీచర్స్ స్థానానికి వైసీపీ, పీడీఎఫ్, ఏపీటీఎఫ్ నుంచి నామినేషన్లు దాఖలయ్యాయి. స్థానిక సంస్థలకు సంబంధించి పశ్చిమగోదావరి జిల్లాలో వైసీపీ తరపున వంక రవీంద్రనాథ్, కావూరు శ్రీనివాస్, వంక రజనీకుమారి, టీడీపీ తరపున వీరవల్లి చంద్రశేఖర్ నామినేషన్‌లు దాఖలు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీ తరపున కుడిపూడి సూర్యనారాయణ, కడప జిల్లాలో రామసుబ్బారెడ్డి, శ్రీకాకుళంలో ఎన్.రామారావు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. నెల్లూరు జిల్లాలో వైసీపీ తరపున మేరుగ మురళీధర్, స్వతంత్ర అభ్యర్థిగా నాగేంద్రప్రసాద్ నామినేషన్లు వేశారు. అనంతపురంలో టీడీపీ తరుపున స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నామినేషన్ వేయకుండా అడ్డుకునేందుకు అధికార పార్టీ విశ్వప్రయత్నాలు చేసింది. అయినా సినీఫక్కీలో వైసీపీ శ్రేణుల కంటపడకుండా కలెక్టరేట్ వెనుకదారి నుంచి లోపలికి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థి నామినేషన్ వేయకుండా అడ్డుకునేందుకు వైసీపీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, శంకర్‌నారాయణ, ఆ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మరికొందరు ముఖ్య నేతలు రంగంలోకి దిగినట్లు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పెద్దసంఖ్యలో వారి అనుచరులను కలెక్టరేట్ ఎదుట మోహరించారు. టీడీపీ అభ్యర్థితో పాటు మద్దతుదారులు ఎటువైపు నుంచి వస్తారోనని రోడ్లపై కాపుకాశారు. అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని పోలీసుల్లా తనిఖీ చేశారు. నామినేషన్ వేసేందుకు సమయం మరో అరగంట ఉందనగా, టీడీపీ తరుపున యాడికి మాజీ ఎంపీపీ, జేసీ సోదరుల ముఖ్య అనుచరుడు వేలూరు రంగయ్య నాటకీయంగా వచ్చారు.

తలపై ముస్లిం టోపీ ధరించి నామినేషన్ పత్రాలను చొక్కాలో దాచుకొని, ఎవరూ గుర్తు పట్టకుండా కలెక్టరేట్ వెనుకవైపు ప్రహరీ దూకి లోపలికి చేరుకున్నారు. రంగయ్య మద్దతుదారులుగా తాడిపత్రి మున్సిపాల్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లు కలెక్టరేట్ ప్రధాన ద్వారం ద్వారా లోపలికి వెళ్లి, ఎన్నికల అధికారి, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు.

గవర్నరును కలిసిన సీఎం దంపతులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నూతన గవర్నర్‌గా నియమితులైన జస్టిస్ అబ్దుల్ నజీర్ దంపతులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతి రాజ్‌భవన్‌లో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. గవర్నరు దంపతులకు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందించారు. ఇప్పటివరకు గవర్నర్‌గా పనిచేసిన విశ్వభూషణ్ హరిచందన్ చత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బదిలీ అయిన విషయం తెల్సిందే. ఆ స్థానంలో కొత్త గవర్నర్‌గా నజీర్ శుక్రవారం బాధ్యతలు తీసుకోనున్నారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ ప్రమాణ స్వీకార ఉత్సవ

- మిగతా 2 లో

రెండు నిమిషాలకో ప్రసూతి మరణం

- రోజుకు 800 మంది మహిళలు మృతి
- పేద దేశాల్లోనే దీన స్థితి: డబ్ల్యూహెచ్‌ఓ

జెనీవా: ప్రపంచ దేశాల్లో ప్రసూతి మరణాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేసింది. ప్రతి రెండు నిమిషాలకో ప్రసూతి మరణం సంభవిస్తున్నట్లు తెలిపింది. గర్భధారణ, ప్రసవ సమయాల్లో నివారించగల కారణాలతో నిత్యం 800 మంది తల్లులు ప్రాణాలు కోల్పోవడం దయనీయమని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. తీవ్రమైన రక్తస్రావం, ఇన్ఫెక్షన్లు, అసురక్షితమైన గర్భవిచ్ఛిత్తి పద్ధతులు, హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వంటి పరిస్థితులు ఈ మరణాలకు కారణాలని, ఇవన్నీ నివారించదగినవేనని పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో 2,87,000 ప్రసూతి మరణాలు నమోదయ్యాయని, ఈ లెక్కన 24 గంటల్లో 800,

రెండు నిమిషాలకు ఒక తల్లి మృత్యుఒడికి చేరుతున్నట్లు డబ్ల్యూహెచ్‌ఓ నివేదిక తెలిపింది. గర్భం దాల్చిన సమయం ఆశలు, ఆకాంక్షలతో మంచి ఆలోచనలు, సానుకూల అనుభవాలతో నిండి ఉండాలిగానీ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భయానక అనుభవాలను ఎదుర్కోవాల్సి రావడం అత్యంత బాధాకరమని డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ ట్రెడోస్ అధానోమ్ ఘెబ్రేయేసెస్ పేర్కొన్నారు. మహిళలు తమ ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, గర్భం దాల్చే సమయం వంటి నిర్ణయాలు ఆలోచించి తీసుకోవాలని డబ్ల్యూహెచ్‌ఓ నొక్కిచెప్పింది. పేద దేశాల్లోనే అత్యధిక ప్రసూతి మరణాలు సంభవిస్తున్నట్లు డబ్ల్యూహెచ్‌ఓ నివేదిక తెలిపింది. ఆఫ్రికాలో 70శాతం మరణాలు 2020లో నమోదు కాగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ కంటే ఇది 136 రెట్లు అధికమని నివేదిక రూపకర్త జెన్నీ క్రెస్‌వెల్ వెల్లడించారు. సిరియా, సోమాలియా, దక్షిణ సూడాన్, సూడాన్, యెమన్‌లో మానవతా సంక్షోభ పరిస్థితులు కొనసాగుతున్న క్రమంలో అంతర్జాతీయ

- మిగతా 2 లో

నోబెల్ శాంతి పురస్కారానికి 305 నామినేషన్లు 2లో

జగనన్న, టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల కోసం

2న విజయవాడలో మహాధర్నా

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగనన్న కాలనీలలో నిర్మించే ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున నిధులు ఇవ్వాలని, టిడ్కో గృహ సముదాయాలకు మౌలిక వసతులు కల్పించి, తక్షణమే లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అధ్వర్యంలో మార్చి 2వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాల్సిందిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ...రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల ఇళ్లు ఇచ్చామని చెబుతున్న వైసీపీ ప్రభుత్వం...వాటి నిర్మాణ స్థితిగతుల్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏమాత్రం నివాసయోగ్యంకాని విధంగా కేవలం సెంటు స్థలం కేటాయించి చేతులు దులుపుకుందని తెలిపారు. పట్టణాలకు, పని ప్రాంతాలకు సుదూరంగా కొండలు, గుట్టలు, చెరువులు, ముంపు ప్రాంతాలలో పేదలకు ఇళ్లస్థలాలు

- మిగతా 2 లో

విపక్ష సభ్యులపై సభా హక్కుల కమిటీ దర్యాప్తు

ఆదేశాలు వెనక్కి

- తక్షణమే అఖిలపక్షం ఏర్పాటు చేయాలి
- సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం డిమాండ్
- రాజ్యసభ చైర్మన్ ధన్కర్‌కు లేఖ

న్యూఢిల్లీ: సభలో గందరగోళం సృష్టించారన్న నెపంతో 12 మంది విపక్ష సభ్యులపై దర్యాప్తునకు రాజ్యసభ చైర్మన్ ధన్కర్ ఆదేశాలివ్వడం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వారసత్వానికి విరుద్ధమని సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం అన్నారు. పార్లమెంటు నిబంధనావళి ప్రకారం తనకున్న హక్కును సభ్యుడు చట్టసభలో వినియోగిస్తే అది 'పార్లమెంటరీ ప్రివిలేజ్'ని అతిక్రమించడం ఎలా అవుతుందని గురువారం ధన్కర్‌కు రాసిన లేఖలో విశ్వం ప్రశ్నించారు. సభా మర్యాదకు విఘాతం నెపంతో 12 మంది విపక్ష సభ్యులు (9 మంది కాంగ్రెస్, ముగ్గురు ఆప్ నేతలు)పై పార్లమెంటరీ కమిటీకి ఆదేశాలివ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ ఆదేశాలను ఉపసంహరించుకోవాలని,ఈ సమస్య పరిష్కారానికి మార్గాలు కనుగొనేందుకు అఖిపక్ష సమావేశాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. సభ్యులపై సభాహక్కుల కమిటీకి నివేదించడం

- మిగతా 2 లో

రేషన్ బియ్యం అక్రమ రవాణా

- పొరుగు రాష్ట్రాలకు తరలింపు
- కోట్లు ఆర్జిస్తున్న ముఠాలు
- నిద్రమత్తులో అధికారులు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రేషన్ బియ్యం పొరుగు రాష్ట్రాలకు పెద్దఎత్తున అక్రమ రవాణా జరుగుతోంది. ఇందులో డీలర్లదే కీలక పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న పేదల ఆకలి తీర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నాయి. ప్రభుత్వాల ఆశయానికి కొందరు అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్‌బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ కోట్ల

- మిగతా 2 లో

అగ్రిగోల్డ్ అసోసియేషన్ నేతలపై

కేసు కొట్టివేత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ 2018 డిసెంబరు 28న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, ప్రధానకార్యదర్శి వి.తిరుపతిరావుపై నమోదు చేసిన కేసును కొట్టి వేశారు. విజయవాడ 3వ అదనపు మెట్రోపాలిటన్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. జ్యోతి ఈ కేసును విచారించిన అనంతరం గురువారం కొట్టివేశారు. ఆనాటి టీడీపీ ప్రభుత్వంలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేకూర్చాలని, సుమారు 1500 మంది బాధితులతో ఆమరణ దీక్షకు పూనుకోగా, రెండోరోజు తెల్లవారుఝామున పోలీసులు ఆందోళనకారులందర్నీ అరెస్టు చేసి దీక్షా శిబిరాన్ని తొలగించారు. వందలాది మందిని వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. సత్యనారాయణ పురం పోలీసులు ఐపీసీ 309, 188 సెక్షన్ల కింద అసోసియేషన్ ముఖ్య నేతలు ముప్పాళ్ల, విశ్వనాథరెడ్డి, తిరుపతిరావుపై కేసు నమోదు చేశారు. ఈ అరెస్టులను నిరసిస్తూ పోలీస్ స్టేషన్లలో ఉన్న బాధితులు ఉదయం అల్పాహారం గాని, మధ్యాహ్నం భోజనం కాని ముట్టకుండా నిరాహారదీక్ష కొనసాగించారు. సాయంత్రం 3.30 గంటల వరకు కూడా వారు ఎటువంటి ఆహార, పానీయాలను స్వీకరించకపోవడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో దిగొచ్చిన పోలీసులు అందరినీ బేషరతుగా విడుదల చేసి ఇళ్లకు పంపించారు. ఆమరణ దీక్షలోవున్న ముప్పాళ్ల, విశ్వనాథరెడ్డి, తిరుపతిరావును అరెస్టు చేసి కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, వారు వైద్య

- మిగతా 2 లో

ఇదీ లోకం!

హేయ్, నన్ను వదులు నేను పెద్ద సారుని!!

కమ్యూనిస్టుల పునరేకీకరణ అవశ్యం

- ఫాసిజం, సామ్రాజ్యవాదాన్ని తిప్పికొట్టాలి
- బీజేపీ ఓటమికి ఐక్యపోరు
- వామపక్ష నేతల పిలుపు
- ఉత్సాహంగా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ మహాసభలు

విశాలాంధ్ర- హైదరాబాద్ : కమ్యూనిస్టు ఉద్యమ నేతల గడ్డ, తెలంగాణలోని హైదరాబాద్‌లో గురువారం అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ)19వ జాతీయ మహాసభలు ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. మహాసభలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం వేదిక కాగా బాగ్ లింగంపల్లి పరిసరాలన్నీ ఏఐఎఫ్‌బీ తోరణాలు, జెండాలు, హోర్డింగులతో కళకళలాడాయి. దేశ నలుమూలల నుంచి 600 మంది ప్రతినిధులు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు హాజరయ్యారు. తొలుత బాగ్ లింగంపల్లిలో భారీ ప్రదర్శన నిర్వహించగా ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ ప్రధాన కార్యదర్శి దేబబ్రత బిశ్వాస్ ఏఐఎఫ్‌బీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి, ఫార్వర్డ్ బ్లాక్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. మధ్యాహ్నం జరిగిన ప్రతినిధుల సభలో దేబబ్రత బిశ్వాస్‌తో పాటు ఏఐఎఫ్‌బీ డిప్యూటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీవీ కతిరావన్, కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు

- మిగతా 2 లో

సైకిలెక్కిన 'కన్నా'

- కండువా కప్పి ఆహ్వానించిన చంద్రబాబు
- రాష్ట్ర భవిష్యత్తు కోసమేనన్న లక్ష్మీనారాయణ
- గుంటూరు మాజీ మేయర్ సహా 3వేల మంది చేరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర మాజీ మంత్రి, సీనియర్ రాజకీయవేత్త, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. గుంటూరు నుంచి వేలాదిమంది అనుచరులతో భారీ ర్యాలీగా మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన కన్నాకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కన్నాతో పాటు ఆయన కుమారుడు, గుంటూరు మాజీ మేయర్ నాగరాజు టీడీపీలో చేరారు. వీరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులు 3 వేల మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ

- మిగతా 2 లో

అమెరికా గజగజ

వణికిస్తున్న భీకర మంచు తుపాను

1500కుపైగా విమానాలు రద్దు

విద్యుత్ లేక అంధకారంలో లక్షల ఇళ్లు

లాస్‌ఏంజిల్స్: అమెరికాను మంచుతుపాను గజగజ వణికిస్తోంది. పశ్చిమ తీరం నుంచి గ్రేట్ లేక్స్ వరకు భారీగా మంచు కురుస్తోంది. రెండు అడుగుల మందంగల మంచు దుప్పటి ఆయా ప్రాంతాలను కప్పేసింది. లక్షలాది ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా వేలాది విమానాలు రద్దయ్యాయి. లాస్‌ఏంజిల్స్ సమీపంలో సాధారణంగా వెచ్చగా ఉండే ప్రాంతాలకు మంచు తుపాను హెచ్చరికలు జారీ అయ్యాయి. ఉత్తరం ప్రాంతాల్లోనూ మంచు కురిసే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. మిన్నెసోటాలో రెండు దఫాలుగా మంచు కురవచ్చునని జాతీయ వాతావరణ విభాగం అధికారులు హెచ్చరికలు జారీచేశారు. ఎన్నడూ లేని విధంగా అతిశీతల వాతావరణ పరిస్థితులు, హిమపాతం, చలిగాలులతో ఉండే ప్రతికూల వాతావరణంలో ప్రయాణం అసాధ్యమన్నారు. మిన్నెసోటాలో గంటకు 55 నుంచి 70 కిలోమీటర్లతో వీచే గాలులతో కలిపి మంచు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రయాణించాల్సి వస్తే వింటర్ సర్వైవల్ కిట్‌ను దగ్గర పెట్టుకోవాలని సూచించారు. అదనంగా ఫ్లాష్‌లైట్, ఆహారం, నీళ్లు వెంట తీసుకెళ్లాలని, అనివార్యమైతే తప్ప ప్రయాణించవద్దన్నారు. ఎక్కడైనా చిక్కుకుపోతే వాహనంలో నుంచి బయటకు రావద్దని సూచనలు చేశారు. గురువారం 1,550 విమాన సేవలను రద్దు చేసినట్లు ఫ్లైట్ అవేర్ డాట్ కామ్ పేర్కొంది. 'మిజరీ మ్యాప్' ద్వారా డెన్వర్, సాల్ట్ లేక్ సిటీ, మినియాపోలిస్, సెయింట్ పాల్, వ్యోమింగ్‌లలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉండటం తెలుస్తోంది. ప్రధాన రహదారులు మంచుతో కప్పబడి ప్రయాణం అసాధ్యంగా మారింది. దాదాపు 2.80 లక్షల ఇళ్లు అంధకారంలో చిక్కుకుపోయాయి. విద్యుత్తు సరఫరా నిలిచిన ఇళ్లలో దాదాపు సగం మిచిగాన్‌లోనే ఉన్నాయి. మరింత ప్రమాదకరమైన అతిశీతల తుపానుకు సిద్ధం కావాలని లాస్‌ఏంజిల్స్‌లోని ఎన్‌డబ్ల్యూఎస్ (వాతావరణ శాఖ) హెచ్చరికలు జారీచేసింది.

నోబెల్ శాంతి పురస్కారానికి 305 నామినేషన్లు - ఆరేళ్లలో కనిష్ఠం

కోపెన్‌హేగన్: నోబెల్ శాంతి పురస్కారానికి సంబంధించి 305 నామినేషన్లు వచ్చినట్లు నార్వేజియన్ నోబెల్ కమిటీ తెలిపింది. ఈ ఏడాది శాంతి పురస్కారం కోసం నామినేషన్ల గడువు ఫిబ్రవరి ఒకటవ తేదీతో ముగిసింది. దీంతో 305 నామినేషన్లు వచ్చాయని కమిటీ ప్రకటించింది. అయితే ఇది నాలుగేళ్లలో కనిష్ఠమని కూడా పేర్కొంది. 93 సంస్థలకు చెందిన 212 మంది పేర్లను విడుదల చేయలేదని వెల్లడించింది. గతేడాది 343 మంది నామినేట్ వచ్చాయని, ఎనిమిదేళ్లుగా ఏటా 300కుపైగా నామినేషన్లు వస్తున్నాయని, 2019 తర్వాత 2023లో తక్కువ మంది నామినేట్ అయినట్లు ప్రకటన తెలిపింది. 2016లో 376 నామినేషన్లు వచ్చినట్లు గుర్తుచేసింది. నోబెల్ శాంతి పురస్కారానికి నామినేట్ అయ్యేది ఎవరన్నది రహస్యంగా ఉంటుంది. 50ఏళ్లుగా ఈ ప్రక్రియ గోప్యంగా సాగుతోందని ప్రకటన పేర్కొంది. విస్తృత బృందాలు, జాతీయ, రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయాల ఆచార్యులు, నోబెల్ శాంతి పురస్కారగ్రహీతలు నామినేషన్లు దాఖలు చేస్తుండగా, ప్రచారం కోసం దాన్ని వారు బహిర్గతం చేస్తుంటారు. ఈసారి నార్వేలో గ్రీన్‌పార్టీకి చెందిన చట్టసభ సభ్యుడు లాన్‌మారీ న్యూయెన్‌బర్గ్ ఇద్దరు వాతావరణ పరిరక్షకులు... స్వీడెన్‌కు చెందిన గ్రేటా థన్‌బర్గ్, ఉగాండాకు చెందిన వనెస్సా నకాటెను నామినేట్ చేశారు. గ్రేటా గతేడాదితో కలిపి ఇప్పటివరకు నాలుగుసార్లు నామినేటయ్యారు. ఓస్లోలోని శాంతి పరిశోధన సంస్థ సంచాలకుడు హెన్రిక్ ఉర్దాల్ మానవ హక్కుల పరిరక్షకులు... ఇరాన్‌కు చెందిన నర్గీస్ మహమ్మదీ, అఫ్గానిస్తాన్‌కు చెందిన మెహబూబా సిరాజ్, అమెరికాలో మయన్మార్ ప్రతినిధి క్యావ్ మో తున్‌ను నామినేట్ చేశారు. కాగా, నోబెల్ పురస్కార విజేతలను అక్టోబరులో ప్రకటిస్తారు. డిసెంబరు 10న (నోబెల్ వర్ధంతి) అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది. అవార్డు రూపేణ విజేతలకు స్వర్ణపతకం, పది మిలియన్ స్వీడిష్ క్రోనోర్ (మిలియన్ డాలర్లు) నగదు అందజేస్తారు.

2న విజయవాడలో మహాధర్నా

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించడంతో ఆయా ప్రాంతాలలో ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సెంటు స్థలం ఒక కుటుంబ నివాసానికి ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు కేటాయించాలని సీపీఐ డిమాండ్ చేసినప్పటికీ జగన్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, జగనన్న కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు ఇప్పటివరకూ కల్పించలేదని విమర్శించారు. ఒక్కో ఇంటికి ప్రభుత్వం ఇచ్చే లక్షా 80 వేల రూపాయలు ఏ మాత్రం సరిపోక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇళ్లను లబ్ధిదారులే నిర్మించుకోవాలని, లేకుంటే ఆయా ఇళ్లను రద్దు చేస్తామని బెదిరింపులకు దిగడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.లక్షా 80 వేలు పునాదులకు కూడా సరిపోవని, ట్రాక్టర్ ఇసుక రూ.8 వేలు, లారీ ఇసుక రూ.40 వేల ధర పలుకుతుంటే పేదలు ఇళ్లను ఎలా నిర్మించుకుంటారని ప్రశ్నించారు. ఇసుక, సిమెంట్, ఇటుక, స్టీల్ తదితర భవన నిర్మాణ సామాగ్రి ధరలు విపరీతంగా పెరిగిన తరుణంలో ఇళ్ల నిర్మాణం చేపట్టిన పేదలు అప్పుల పాలవుతున్నారని వివరించారు. జగనన్న ఇళ్ల కోసం ఇసుక, సిమెంటు ఉచితంగా సరఫరా చేయాలని, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిర్మాణం పూర్తిచేసుకున్న లక్షలాది టిడ్కో గృహాలను ఇంతవరకు లబ్ధిదారులకు అప్పగించకుండా జగన్ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. సొంతగూడు సమకూరుతుందన్న ఆశతో అప్పులు తెచ్చి డిపాజిట్లు కట్టిన లబ్ధిదారులు మూడేళ్లుగా టిడ్కో ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని వివరించారు. తక్షణమే టిడ్కో గృహ సముదాయాలకు మౌలిక సదుపాయాలు కల్పించి, లబ్ధిదారులకు స్వాధీనపరచాలని డిమాండ్ చేశారు. జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్లపై ఇప్పటికే లబ్ధిదారులతో అధికారులకు అర్జీలు ఇప్పించడం, కలెక్టర్ల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. మార్చి 2న విజయవాడలో మహాధర్నా జరగనుందని, లబ్ధిదారులతోపాటు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

సైకిలెక్కిన 'కన్నా'

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయం వద్ద కోలాహలం నెలకొంది. కన్నాతో పాటు వచ్చిన ముఖ్య నేతలందరికీ చంద్రబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండే నేత, సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన వ్యక్తి, రాజకీయాల్లో హుందాగా వ్యవహరించిన నాయకుడు కన్నా లక్ష్మీనారాయణ అని కొనియాడారు. గతంలో రాజకీయంగా కన్నాతో విభేదించాం కానీ వ్యక్తిగతంగా ఎప్పుడూ తాము విమర్శించుకోలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి వచ్చిన కన్నాకు స్వాగతం చెపుతున్నానన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని కాదని ప్రతిపక్షంలో ఉన్న టీడీపీలో చేరారంటే కేవలం రాష్ట్ర అభివృద్ధి కోసమేనని, అమరావతే రాజధానిగా ఉండాలన్నది ఆయన ఆకాంక్షగా పేర్కొన్నారు. రాష్ట్రానికి ఇప్పటి వరకు 17 మంది ముఖ్యమంత్రులు పనిచేశారని, కానీ రాష్ట్రానికి జగన్ అంత నష్టం చేకూర్చిన ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. జగన్‌ది క్రూర మనస్తత్వమన్నారు. జగన్ అన్ని వ్యవస్థలనూ ధ్వంసం చేశారని విమర్శించారు. స్కూళ్లలో నాడు నేడు అన్నారు....ఒక్క డీఎస్సీ ప్రకటించలేదు. రైతుల ధాన్యం కొనేందుకు మంచి వ్యవస్థను తీసుకువస్తే....ఆర్బీకేల పేరుతో ఆ వ్యవస్థనూ నాశనం చేశారు. అన్ని వర్గాల కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేశారు. నాణ్యత లేని మద్యం అమ్మి ప్రజల జీవితాలు నాశనం చేస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే చాలా ఆవేదన కలుగుతోంది. ప్రజల జీవన ప్రమాణాలు దారుణంగా పడిపోయాయి. బీహార్ కూడా ఏపీ కంటే చాలా మెరుగ్గా ఉంది. ఒకప్పుడు ఎన్జీవోలు గట్టిగా ఉండేవాళ్లు...ఇప్పుడు వాళ్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఒకప్పుడు మీడియా గట్టిగా ఉండేది...ఇప్పుడు జగన్ దెబ్బకు వాళ్లూ రాయలేని పరిస్థితి నెలకొంది. రాజకీయ నాయకులకే అడ్డంకులు సృష్టిస్తే....సామాన్య ప్రజల సంగతి ఏంటో ఆలోచించండి. నేను ప్రజా చైతన్యం కోసం ప్రయత్నం చేస్తున్నాను. కన్నా స్ఫూర్తితో అందరూ కలిసి రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

రాష్ట్ర భవిష్యత్ కోసమే: కన్నా

రాష్ట్ర భవిష్యత్తు కోసమే తెలుగుదేశం పార్టీలో చేరానని కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. తాను మొదటి నుంచి చంద్రబాబు నాయుడుకి వ్యతిరేకంగా పనిచేశానని, అయితే నేడు రాక్షస పాలన సాగిస్తున్న జగన్‌ను గద్దె దించాల్సిన అవసరం ఉందని, సంక్షేమం అంటే చాక్లెట్ ఇచ్చి నెక్లెస్ ఎత్తుకెళ్లడం కాదన్నారు. జగన్ ఏమన్నా భారతీ సిమెంట్ డబ్బులు తెచ్చి ఇస్తున్నారా? 9 లక్షల కోట్లు అప్పులు చేసినా మరోవైపు చెత్తపైనా పన్నులు వేస్తున్నారు. ఈ డబ్బులు అన్నీ జగన్ ఏం చేస్తున్నారు? అమరావతినే రాజధానిగా ఉంచుతానని చెప్పిన జగన్...తరువాత మాట మార్చి మూడు రాజధానులు అన్నారు. విశాఖ అయితే అభివృద్ధి చెందిన ప్రాంతం కాబట్టి అక్కడ దోచుకోవచ్చని జగన్ భావిస్తున్నారు. రాక్షసుడు అయిన జగన్‌ను రాష్ట్రం నుంచి పారదోలాలని, రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి ప్రజాస్వామ్యవాదులంతా కలిసి రావాలని కన్నా కోరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ముఖ్యనేతలంతా పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

(మొదటిపేజీ తరువాయి)

రూపాయలు ఆర్జిస్తున్నారు. అక్రమార్కులు సిండికేట్‌గా ఏర్పడి రాత్రి వేళ లారీలు, మినీవ్యాన్‌లు, ఆటో ట్రాలీలలో పొరుగు రాష్ట్రాలకు, జిల్లాలకు రహస్యంగా తరలిస్తున్నారు. చాలాకాలంగా ఈ దందా కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రతినెలా టన్నుల కొద్ది బియ్యం పక్కదారి పడుతున్నాయి. రేషన్ బియ్యం తరలింపును అడ్డుకునే అధికారం ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రత్యేక అధికారులు, పోలీసులకు ఉన్నప్పటికీ ఈ దందా కొనసాగుతూనే ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న బియ్యం గురించి గ్రామీణ ప్రాంత పేదలకు చాలా వరకు తెలియదు. కేంద్రం బియ్యం గురించి డీలర్లు సైతం చెప్పడం లేదు. ప్రతి నెలా రెండుసార్లు ఇవ్వాల్సిన బియ్యాన్ని ఒక్కసారి ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యాన్ని కొంతమంది దళారులు, డీలర్లు కుమ్మక్కై దారి మళ్లిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా బాగోతం కొంతకాలంగా సాగుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, అక్రమ రవాణా విషయంలో చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటం అక్రమార్కులకు వరంగా మారింది. గుట్టు చప్పుడు కాకుండా సరిహద్దు చెక్‌పోస్టులు దాటుతున్నాయి. పట్టణాల్లో నెలకు రెండుసార్లు బియ్యం పంపిణీ జరుగుతోంది. కానీ పల్లెలకు సరఫరా చేసే బియ్యం మాత్రం దారి మళ్లుతున్నాయి. పోలీసుల సహకారంతో అడపాదడపా తనిఖీలు నిర్వహించినా ఫలితం శూన్యం. బియ్యం తరలింపులో అక్రమార్కులు మరింత చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. బియ్యం లారీలకు అర కిలోమీటర్ ముందు ముఠా సభ్యులు కార్లలో ప్రయాణిస్తుంటారు. పొరపాటున తనిఖీల్లో పట్టుబడినా తమ పేర్లు చెప్పకూడదని లారీ యజమానులు, డ్రైవర్లతో ముందస్తు ఒప్పందం కుదుర్చుకుంటారు. ఇందుకు అవసరమైన మేర డబ్బును బియ్యం మాఫియా లారీ యజమానులకు, డ్రైవర్లకు ఇస్తున్నట్లు సమాచారం. ప్రజల అవసరాల కోసం ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం ప్రతినెలా పక్కదారి పట్టిస్తున్న ముఠాల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అమెరికా అధ్యక్ష బరిలో వివేక్ రామస్వామి

- రిపబ్లికన్ అభ్యర్థిగా పోటీలోకి
- నిక్కీహేలీ తర్వాత రేసులో నిలిచిన రెండో భారత సంతతి వ్యక్తి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పీఠానికి భారత సంతతి వివేక్ రామస్వామి తన పోటీని ప్రకటించారు. 37ఏళ్ల రామస్వామి ఇండో-అమెరికన్ టెక్ ఎంట్రప్రెన్యూర్. ఈయన తల్లిదండ్రులు కేరళ నుంచి అమెరికాకు వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. రామస్వామి ఇంతకుముందు ఓహియోలో జనరల్ ఎలక్ట్రిక్ ప్లాంట్ ఉద్యోగం చేశారు. తాజాగా అమెరికా రేసులో నిలవనున్నారు. రిపబ్లికన్ పార్టీ తరపున తన అభ్యర్థిత్వాన్ని రామస్వామి అధికారికంగా ప్రకటించారు. భారత సంతతికి చెందిన నిక్కీహేలీ ఇప్పటికే తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన క్రమంలో అమెరికా అధ్యక్ష రేసులో నిలిచిన రెండవ భారత సంతతి వ్యక్తిగా రామస్వామి ఉన్నారు. ఓ ప్రముఖ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రామస్వామి తాను అధ్యక్ష పదవికి పోటీ చేయబోతున్నట్లు వెల్లడించారు. అమెరికా ఆదర్శాలను తిరిగి పునరుద్ధరించేందుకు అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. ఇది రాజకీయ ప్రచారం మాత్రమే కాదు. తర్వాతి తరం అమెరికన్లకు కొత్త కలలను సృష్టించేందుకు చేస్తున్న సాంస్కృతిక ఉద్యమం అని చెప్పారు. 'అమెరికా ఫస్ట్'కు సిద్ధమన్నారు. వివేక్ రామస్వామి 1985, ఆగస్టు 9న ఓహియోలో జన్మించారు. హార్వర్డ్, యేల్ యూనివర్సిటీల్లో విద్యను అభ్యసించారు. 'స్ట్రైవ్ అసెట్ మేనేజ్‌మెంట్'ను రామస్వామి స్థాపించినట్లు ఆయన లింక్డిన్ ప్రొఫైల్ ద్వారా తెలుస్తోంది. అంతకుముందు ఆయనకు ఔషధరంగంలో మంచి పేరు ఉంది. 'రొవాంట్ సైన్సెస్'ను ఏర్పాటు చేశారు. రామస్వామి ఆస్తుల విలువ 600 మిలియన్ డాలర్లుగా 2016లో ఫోర్బ్స్ గణాంకాల పేర్కొన్నాయి. దీంతో 40 ఏళ్లలోపు సంపన్నుల్లో ఒకరిగా రామస్వామి నిలిచారు. ఆయన మాట్లాడుతూ, అమెరికా విదేశీ విధానాన్ని మార్చాలన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని చైనా అతిక్రమిస్తోందని ఆరోపించారు. చైనా నుంచి స్వాతంత్ర్యాన్ని కోరుతూ తీర్మానించాలన్నారు. అమెరికా గగనతలంలోకి ప్రవేశించిన బెలూన్ చైనాది కాకుండా రష్యాకు చెంది ఉంటే దాన్ని తక్షణమే పేల్చివేసేవాళ్లమని, చైనా విషయంలో ఆ పనిచేయలేకపోయినట్లు చెప్పారు. ఆధునిక జీవనంలో భాగంగా ఎక్కువగా చైనామీదే ఆధారపడుతున్నామని, 'ఎకనామిక్ కో డిపెండెంట్' బంధాన్ని తెంచుకోవాలని, అది ఏ మాత్రం సులభమైనది కాబోదని రామస్వామి అన్నారు. ఇందుకోసం త్యాగాలు తప్పబోవన్నారు. కొన్ని అసౌకర్యాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా ఆయనన్నారు.

ఇదిలావుంటే, 2024లో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అన్న నిర్ణయాన్ని ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించాల్సి ఉంది. ఆయన పోటీ చేస్తారని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. మార్చి లేదా ఏప్రిల్‌లో బైడెన్ తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించనున్నట్లు తెలిపాయి. ఇదే జరిగితే డెమొక్రటిక్ పార్టీలో ఆయనకు పోటీ ఉండదు. ఇక రిపబ్లికన్ పార్టీ విషయానికొస్తే మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అభ్యర్థిత్వాన్ని ఇప్పటికే ప్రకటించారు. ఫ్లోరిడా గవర్నర్ రాన్ దేశాంటిస్, మాజీ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, మాజీ కార్యదర్శి మైక్ పాంపియో వంటి వారు కూడా త్వరలోనే అధ్యక్ష పదవి కోసం పోటీ చేస్తామని ప్రకటించనున్నట్లు సంకేతాలు ఉన్నాయి. అయితే 2024 అధ్యక్ష రేసులో నిలవబోయే అభ్యర్థుల్లో ఏకైక మహిళా అవడమే కాకుండా నాన్‌వైట్ అభ్యర్థిగానూ ఆమె ఉంటారు.

స్థాయీ సంఘాన్ని తిరిగి ఎన్నుకోవాలి

ఎంసీడీ కార్యదర్శి సిఫార్సు

బీజేపీ, ఆప్ సభ్యుల ఘర్షణతో సభ రసాభాస-వాయిదా

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) శుక్రవారం ఉదయం 10 గంటల వరకు వాయిదా పడింది. బీజేపీ-ఆప్ సభ్యుల మధ్య ఘర్షణ క్రమంలో సభ రసాభాస అయింది. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు హైడ్రామా నడించింది. ఈ పరిస్థితుల్లో ఎన్నికల ప్రక్రియ గౌరవానికి భంగం వాటిల్లిందని, స్టాండింగ్ కమిటీ (స్థాయి సంఘం) సభ్యులను తిరిగి ఎన్నుకోవాలని ఎంసీడీ కార్యదర్శి సిఫార్సు చేశారు. ఓటింగ్ సమయంలో ఫోన్లను బీజేపీ కౌన్సిలర్లు వాడారని ఆప్ సభ్యులు ఆరోపించడంతో ప్రతిష్ఠంభన నెలకొంది. పర్యవసానంగా ఎంసీడీ సభ వాయిదా పడింది. ఈ మేరకు నివేదికను మేయర్ షెల్లీ ఒబెరాయ్, కమిషనర్ జ్ఞానేశ్ భారతికి పంపారు. స్థాయి సంఘం సభ్యులు ఆరుగురి ఎన్నికకు సరిపడ బ్యాలెట్ పత్రాలు లేవని, ఎన్నికలను తిరిగి నిర్వహించడం ముఖ్యమని అందులో నొక్కిచెప్పారు. 245 బ్యాలెట్ పత్రాలు ఉన్నాయని, ఎన్నికలకు 250 బ్యాలెట్ పత్రాలు అవసరమన్నారు. 300 బ్యాలెట్ పత్రాలతో సంప్రదాయబద్ధంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని, వాటిలో కొన్ని పనికిరాకపోవచ్చని, కొత్త బ్యాలెట్ల ముద్రణకు సయమం పడుతుందని కార్యదర్శి పేర్కొన్నారు. స్థాయి సంఘం సభ్యుల ఎన్నికల కోసం 55 బ్యాలెట్ పత్రాలను జారీ చేయగా ఎంత మంది కౌన్సిలర్లు తమ ఓటును బ్యాలెట్ బ్యాకులో వేశారన్న స్పష్టత లేదని నివేదిక పేర్కొంది. కొందరు సభ్యులు తమ ఓట్ల ఫొటోలు తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలతో బీజేపీ-ఆప్ మధ్య గొడవతో నెలకొన్న గందరగోళం వల్ల సభ వాయిదా పడిందని, బ్యాలెట్ బాక్సులను భద్రపరిచామని, ఓటు వేయలేకపోయిన వారు తమ బ్యాలెట్లను జేబుల్లో పెట్టుకున్నారని తెలిపింది. ఢిల్లీ బీజేపీ నేతలు, కౌన్సిలర్లు కూడా స్థాయి సంఘాన్ని తిరిగి ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు. 55 బ్యాలెట్ పత్రాలు జారీ కాగా 45 పోలయ్యాయని 10 జాడలేవని ఆ పార్టీ ఎంపీ పర్వేశ్ వర్మ అన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్ సమయంలో పోలింగ్ బూత్ వద్దకు మొబైల్ ఫోన్‌గానీ పెన్‌గానీ తీసుకెళ్లేందుకు అనుమతి లేదని కార్యదర్శి నివేదిక పేర్కొందిగానీ వాటిని స్థాయి సంఘం ఎన్నిక సమయంలో మేయర్ అనుమతించిదాన్ని బీజేపీ సభ్యులు వ్యతిరేకించారు. బ్యాలెట్ గోప్యతకు విఘాతం కలిగిందని ఆరోపించారు. ఆప్ సభ్యులు మేయర్ నిర్ణయానికి మద్దతిచ్చినట్లు కార్యదర్శి నివేదిక పేర్కొంది.

ఓటమి భరించలేక బీజేపీ గూండాగిరి: ఆప్

మేయర్ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక బీజేపీ గూండాగిరికి దిగిందని ఆప్ ఆరోపించింది. ఎంసీడీలో ఘర్షణాత్మక పరిస్థితులను ఖండించింది. ప్లాస్టిక్ సీసాలు విసరడమే పిడిగుద్దులు సైతం సభ్యులు పరస్పరం కురిపించారు. దీంతో సభను మేయర్ శుక్రవారానికి వాయిదా వేశారు. ఇదే అంశమై మేయర్ విలేకరులతో మాట్లాడుతూ స్థాయి సంఘం ఎన్నికలప్పుడు బీజేపీ సభ్యులు బ్యాలెట్ పేపర్లను చించివేశారని, బ్యాలెట్ బాక్సును విసిరేశారని చెప్పారు. బీజేపీ సభ్యుల తీరు సిగ్గుచేటని, తనపైనా దాడి జరిగిందన్నారు. వెల్‌లోకి వచ్చి బీజేపీ సభ్యులు ఘెరావ్ చేశారని, సభ కార్యకలాపాలు 13సార్లు వాయిదా పడ్డాయని తెలిపారు. బీజేపీ సభ్యులు రాజ్యాంగవిరుద్ధ పద్ధతులను అనుసరించారని, ఇది ఢిల్లీ ప్రజలకు నష్టదాయకమని అన్నారు. బీజేపీ నేతలు రేఖా గుప్తా, అమిత్ నాగ్‌పాల్ సభలో గూండాగిరికి దిగారని, వారిపై చర్యలు తీసుకుంటామని షెల్లీ ఒబెరాయ్ తెలిపారు. ఓటేసేటప్పుడు మొబైల్‌ను నిషేధించే లేదన్నారు. ఆప్ సీనియర్ నేతలు సంజయ్ సింగ్, అతీషీ మాట్లాడుతూ బీజేపీ గూండాగిరికి దిగేసరికి 47 ఓట్లు పోలయ్యాయి... వాళ్లు మరోమారు ఇలా చేయరన్న హామీ ఏమిటి? 100 ఓట్లు తర్వాత వాటిని చెల్లనవిగా ప్రకటించమంటే పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించారు.

యూపీ అసెంబ్లీలో గందరగోళం

కుల గణనకు ఎస్‌పీ డిమాండ్

లక్నో: బీహార్ తరహాలో ఉత్తరప్రదేశ్‌లోనూ కుల సర్వే నిర్వహించాలని సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యేలు గురువారం డిమాండ్ చేశారు. దీనిని యోగి ప్రభుత్వం నిరాకరించింది. దీంతో ఎస్‌పీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గందరగోళం సృష్టించారు. యూపీ అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశాన్ని ఎస్‌పీ ఎమ్మెల్యే సంగ్రామ్‌సింగ్ లేవనెత్తారు. బీహారు తరహాలో రాష్ట్రంలోనూ కుల ప్రాతిపదికన జనగణన చేస్తారా లేదా అని ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వం స్పందిస్తూ కుల సర్వే చేయబోమని, ఇది కేంద్రం పరిధిలోని అంశమని తెలిపింది. ప్రభుత్వ సమాధానం పట్ల అసంతృప్తి వ్యక్తంచేసిన ఎస్‌పీ సభ్యులు సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. వెల్‌లోకి దూసుకొచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకగా నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సతీశ్ మహానా సభను 35 నిమిషాలు వాయిదా వేశారు. ప్రభుత్వం తరపున వ్యవసాయ మంత్రి సూర్య ప్రతాప్ షాహీ మాట్లాడుతూ రాజ్యాంగంలోని 246 అధికరణ ప్రకారం జన గణన కేంద్రం పరిధిలోనిదని, కేంద్రమే ఆ పని చేయాలని చెప్పారు. జనాభా లెక్కలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చట్టం, నిబంధనలు రూపొందించిందన్నారు.

బీహార్ మాదిరిగా తిరోగమన చర్యలకు తాము సుముఖంగా లేమని మంత్రి చెప్పారు. బీహార్‌లో అనారిక, అవినీతి ప్రభుత్వం ఉందని, వారసత్వ రాజకీయాలు కొనసాగుతున్నాయని, ఆ దిశగా తాము వెళ్లడానికి సిద్ధంగా లేమని పేర్కొన్నారు. యూపీని ఉత్తమ ప్రదేశ్‌గా మార్చాలని ప్రభుత్వం కోరుకుంటున్నట్లు చెప్పారు.

కమ్యూనిస్టుల పునరేకీకరణ అవశ్యం

(మొదటిపేజీ తరువాయి)



జి.దేవరాజన్, జీఆర్ శివశంకర్, నరేన్ ఛటర్జీ, గోవింద రాయ్, జ్యోతి రాజన్, అమరేశ్ కుమార్‌తోపాటు సౌహార్ద ప్రతినిధులుగా సీపీఐ కార్యదర్శి డా. కె.నారాయణ, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు సుభాషిణిఅలీ, ఆర్‌ఎస్పీ నేత ప్రేమ్ చంద్రన్, సీపీఐ ఎం.ఎల్ జాతీయ నేత ఎస్.మూర్తి పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ దేశంలోని మతోన్మాద బీజేపీని అడ్డుకునేందుకు వామపక్ష పార్టీలన్నీ ఐకంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో దేశంలో పేదరికం, నిరుద్యోగం, అసమానతలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ఇటువంటి ప్రమాద పరిస్థితుల్లో వామపక్ష శక్తులన్నీ ఏకమై అలుపెరుగని పోరాటాలకు నాంది పలకాలని సూచించారు. వామపక్షాల ఐక్యతకు ఏఐఎఫ్‌బీ సమావేశాలు దోహదమయ్యాయన్నారు.

సీపీఐ కార్యదర్శి కె.నారాయణ సౌహార్ద్రసందేశం ఇస్తూ, కమ్యూనిస్టు పార్టీలు పునరేకీకరణ కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి ప్రమాదంలో పడిందని, దేశంలో ఫాసిజం, సామ్రాజ్యవాదం పుంజుకున్నాయని, సామాజిక న్యాయ సూత్రాలు ప్రమాదంలో ఉన్నాయని, గుత్తాధిపత్యాలు పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. లౌకిక, ప్రజాస్వామిక ప్రత్యామ్నాయాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష శక్తులతో కూడిన విస్తృత కూటమిని నిర్మించడం తక్షణావసరమని నొక్కిచెప్పారు. సీపీఎం నేత సుభాషిణీ అలీ మాట్లాడుతూ బీజేపీ ఫాసిస్టు...హిందుత్వ అజెండాను వేగంగా అమలు చేస్తోందని, మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూల నిర్ణయాలతో ఊడిగం చేస్తోందని విమర్శించారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, దేశ వనరులను కార్పొరేట్‌కు దారాదత్తం చేస్తోందని, రైతుల భూములను స్వాధీనం చేసుకునేలా వ్యవసాయ చట్టాలు తెచ్చిందని దుయ్యబట్టారు. ఆర్‌ఎస్పీ నేత ప్రేమ్ చంద్రన్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ విధానాలతో నిరుద్యోగం తారాస్థాయికి పెరిగిందని, హిందూ-ముస్లింల పేరిట దేశాన్ని విభజిస్తున్నదని విమర్శించారు. 2024లో బీజేపీ తిరిగి అధికారంలోకొస్తే ప్రజాస్వామ్యానికి ముప్పు పెరుగుతుందన్నారు. సీపీఐ ఎంఎల్ నేత ఎస్.మూర్తి మట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగిస్తున్న బీజేపీని అడ్డుకునేందుకు వామపక్ష పార్టీలన్నీ ఐక్యపోరాటం సాగించాలన్నారు. మతోన్మాద శక్తులను అడ్డుకోవడం కమ్యూనిస్టుల వల్లనే సాధ్యమన్నారు. దేబబ్రత బిస్వాస్ మాట్లాడుతూ రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని, నేతాజీ లాంటి అనేక మందిని హైజాక్ చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. మహాసభలలో ఫార్వర్డ్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్వీ ప్రసాద్, ఉపాధ్యక్షులు అంబటి జోజిరెడ్డి, కార్యదర్శి కె.తేజదీప్ రెడ్డి, నాయకులు బి.రాములు యాదవ్, జి.వంశీధర్ రెడ్డి, కొమ్మూరి వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.

కేసు కొట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

సేవలను నిరాకరించారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కరించేవరకు, దీనిపై ప్రభుత్వం చర్చలు జరిపేవరకు వైద్య సహాయాన్ని ఆమోదించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఆసుపత్రిలోనూ తమ దీక్షను కొనసాగించారు. ఈ నేపథ్యంలో దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం 29వ తేదీ రాత్రి 12.30 గంటల సమయంలో ఆనాటి మంత్రులు కాల్వ శ్రీనివాసులు, నక్కా ఆనందబాబు, ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షులు కుటుంబరావు మీడియాతో సహా ఆసుపత్రికి వచ్చి అసోసియేషన్ నేతలతో చర్చలు జరిపారు. ప్రభుత్వం తక్షణమే రూ.250 కోట్లను విడుదల చేసి, వాటిని కార్పస్ ఫండ్‌గా పెట్టి వంతుల వారీగా చెల్లింపులు జరుపుతామని హామీ ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా వారిపై పెట్టిన కేసు ఆరేళ్ల తర్వాత కొట్టివేశారు. న్యాయవాదుల చలసాని అజయ్‌కుమార్, ఆయన జూనియర్‌లు ఈ కేసుపై వాదనలు వినిపించారు.

రెండు నిమిషాలకో ప్రసూతి మరణం

(మొదటిపేజీ తరువాయి)

సగటు కంటే రెట్టింపుస్థాయిలో ప్రసూతి మరణాలు నమోదవుతున్నట్లు డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. ఆరోగ్య సంరక్షణ ప్రతి తల్లికి లభించినప్పుడు సుఖ ప్రసవం, ఆరోగ్యకరమైన భవిష్యత్, కుటుంబంలో సుఖసంతోషాలు కలుగుతాయని ఐరాస పిల్లల నిధి యూనిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ క్యాథరీన్ రస్సెల్ అన్నారు. 2020లో అంతర్జాతీయ స్థాయిలో 1,00,000 జననాలకు సగటున 223 ప్రసూతి మరణాలు సంభవించినట్లు ఐరాస పేర్కొంది. 2000 సంవత్సరంలో 339 మరణాలు నమోదు కాగా ఈ రేటును 2030 నాటికి 70 కంటే తక్కువకు చేర్చాలన్నది ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీల్లో) ఒకటి.

ఆదేశాలు వెనక్కి

(మొదటిపేజీ తరువాయి)

అనవసరమైన చర్యగా పేర్కొన్నారు. పార్లమెంటులో ఒక్క అంశంపైనా చర్చ జరగనివ్వడం లేదని ప్రభుత్వ తీరును ఆక్షేపించారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం ఏ మాత్రం అనుకూలంగా లేకపోవడం ఆందోళనకలిగించే అంశమని, ప్రజాస్వామ్యంలో పార్లమెంటు అంటే చర్చలు జరపడమేనని విశ్వం వెల్లడించారు. విపక్ష ఎంపీలపై సభాహక్కుల కమిటీ విచారణకు ధన్కర్ ఆదేశాలివ్వడం పార్లమెంట్ 'ప్రజాస్వామ్య వారసత్వం'కు వ్యతిరేకమని తాను బలంగా నమ్ముతున్నట్లు సీపీఐ ఎంపీ పేర్కొన్నారు. కాంగ్రెస్, ఆప్ ఎంపీలు సభ కార్యకలాపాలకు విఘాతం కలిగించారని, పదేపదే వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారని, తద్వార సభ మర్యాదకు విఘాతం కలిగిందని, దీనిపై పార్లమెంటరీ కమిటీ విచారణ జరిపించాలని ధన్కర్ ఇటీవలి ఆదేశాలిచ్చారు.

గవర్నరును కలిసిన సీఎం దంపతులు

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం రాత్రి 8.15 గంటలకు గవర్నర్ దంపతులు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి స్వయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దంపతులు పుష్పగుచ్ఛాలందజేసి ఘన స్వాగతం పలికారు. తాజాగా గురువారం మళ్లీ రాజభవన్‌లో మర్యాదపూర్వకంగా సీఎం దంపతులు కలిశారు. ఈ సందర్భంగా సీఎం, గవర్నర్ దంపతులు పరస్పరం దుశ్శాలువలతో సత్కరించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల అభివృద్ధి కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఈ సందర్భంగా సీఎం జగన్ గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు తెల్సింది.

బీఎంఎస్ భారీ పెట్టుబడులు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో బీఎంఎస్ ఫార్మా సంస్థ పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టనుంది. ఈ మేరకు పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు సమక్షంలో ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని (ఎంవోయూ) కుదుర్చుకుంది.

డ్రగ్ డెవలప్‌మెంట్, ఐటీ, ఇన్నోవేషన్ రంగాల్లో కార్యకలాపాలను హైదరాబాద్ కేంద్రంగా బీఎంఎస్ నిర్వహించనుంది. రానున్న మూడేళ్లలో బీఎంఎస్ కంపెనీ సుమారు 1500 మంది ఉద్యోగులను నియమించుకోబోతోంది. ఇందుకోసం సుమారు 100 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది.

25, 26 తేదీల్లో పాలిటెక్నిక్ విద్యార్థులకు జాబ్‌మేళా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం ఈనెల 26, 27 తేదీల్లో విజయవాడ ఐలాపురం కన్వెన్షన్ సెంటరులో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మేధా సర్వో సంస్థ మూడు లక్షల ప్యాకేజీతో వందమంది ఇంజినీరింగ్ ట్రైనీలను తీసుకోనుందని తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు డిప్లొమా విద్యార్థులకు తక్షణమే ఉపాధి అవకాశాలు కల్పించేలా సాంకేతిక విద్యాశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. గత డిసెంబర్‌లో రూ.3 లక్షల ప్యాకేజీతో మేధా సంస్థ 31 మందికి పారిశ్రామిక శిక్షణతో కూడిన ఉద్యోగ అవకాశమిచ్చిందని గుర్తుచేశారు. సాంకేతిక విద్యాశాఖ చేస్తున్న నిరంతర ప్రయత్నాల వల్ల మరోసారి డిప్లొమా విద్యార్థులకు ఇంజినీరింగ్ ట్రైనీలుగా అవకాశమివ్వడానికి సంస్థ అంగీకరించిందన్నారు. ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ బ్రాంచ్‌లలో 2022లో ఉత్తీర్ణులయిన వారంతా నేరుగా వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఇంటర్వ్యూలు జరిగే సమయంలో సాంకేతిక విద్యాశాఖ నుంచి అధికారులను అందుబాటులో ఉంచుతామని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 9346207421 నంబరును సంప్రదించవచ్చన్నారు.

జగన్ ఫ్యాక్షన్ రాజకీయం

నారా లోకేశ్

విశాలాంధ్ర-రేణిగుంట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మరోసారి విరుచుకుపడ్డారు. జగన్ ఆలోచనంతా ఫ్యాక్షనిజమేనని విమర్శించారు. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర 25వ రోజు గురువారం తిరుపతి జిల్లా రేణిగుంట మండల పరిధిలో కొనసాగింది. రేణిగుంటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో యాదవులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. యాదవులు తమ సమస్యలను లోకేశ్‌కు వివరించారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ రాజ్యాంగం బదులు... రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్‌ది భూస్వామ్య మనస్తత్వమని ఆరోపించారు. ఎవరు ఎదిగినా భరించలేరని చెప్పారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లు దిష్టి బొమ్మల్లా ఉన్నాయన్నారు. జగన్ కటింగ్‌ల ముఖ్యమంత్రి అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశ పెట్టిన చంద్రన్న బీమా, రంజాన్ తోఫా, చంద్రన్న సంక్రాంతి కానుక, అన్న క్యాంటీన్లు వంటి వాటిని రద్దు చేశారన్నారు. జగన్ నిర్ణయాలతో పేద, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు వినడానికి, రాష్ట్ర భవిష్యత్తు కోసం తాను యువగళం పాదయాత్ర చేపడితే పోలీసులను ఉసిగొల్పి అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. పాదయాత్రలో స్వేచ్ఛగా మాట్లాడకుండా పోలీసులు తనను అడ్డుకుంటున్నారన్నారు. ఏర్పేడు మండలంలో బుధవారం తనపై దాడికి వైసీపీ కార్యకర్తలు కత్తులు, కటార్లతో వచ్చినా కేసులు పెట్టలేదన్నారు. రేణిగుంట మండలం గాజుల మండ్యంలో ప్రజల కోరిక మేరకు తాను స్టూలు ఎక్కి మాట్లాడటానికి ప్రయత్నిస్తే ఓ సీఐ దురుసుగా ప్రవర్తించారన్నారు. ఆయన తీరుకు సాటి పోలీసులే నవ్వుకున్నారని లోకేశ్ చెప్పారు. 10 శాతం మంది పోలీసుల కారణంగా 100 శాతం పోలీసులకు చెడ్డపేరు వస్తోందని ఆయన విచారం వ్యక్తం చేశారు. జీవో నంబరు ఒకటిని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రజల బాధలు పోవాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మాజీమంత్రి అమరనాథరెడ్డి, టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బలిమెల నీటి పంపకాలపై కుదిరిన ఒప్పందం

విశాలాంధ్ర-సీలేరు (అల్లూరి జిల్లా): ఆంధ్రా-ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై రెండు రాష్ట్రాల అధికారులు గురువారం సమీక్షించారు. బలిమెల జలాశయం నుంచి తమ వాటాగా ఎంత నీటిని వినియోగించుకున్నారో...ప్రస్తుతం ఎన్ని టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయో...ఇందులో ఎవరి వాటా ఎంత అన్న అంశాలపై అధికారులు చర్చించి లెక్కలు తేల్చారు. 2021-22 నీటి సంవత్సరంలో ఒడిశా కంటే ఆంధ్రప్రదేశ్ 5.8765 టీఎంసీలు అధికంగా వినియోగించుకుందని, 2022-2023 నీటి సంవత్సరానికిగాను జులై 2022 నుంచి జనవరి 2023 చివరి నాటికి 24.1318 టీఎంసీలు వినియోగించుకున్నట్టు లెక్కలు తేల్చారు. దీనిప్రకారం ఏపీ ఇప్పటి వరకు తమ వాటాగా 30.0083 టీఎంసీలు వినియోగించుకుందని, ఒడిశా 2022-23 నీటి సంవత్సరానికిగాను జులై ఒకటి నుంచి 2023 జనవరి 31 నాటికి 31.5241 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్టు తేల్చారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో 45.2674 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్టు గుర్తించారు. ఇందులో ఆంధ్రా వాటా 23.3916 టీఎంసీలుగా, ఒడిశా వాటా 21.8758 టీఎంసీలుగా పంపకాలు చేశారు. రెండురాష్ట్రాల విద్యుత్, తాగునీరు, రబీ పంటల అవసరాల నిమిత్తం ఆంధ్రా 4 వేల క్యూసెక్కులు, ఒడిశా 1800 క్యూసెక్కుల నీటిని వినియోగించుకోవడానికి రెండు రాష్ట్రాల మధ్య అంగీకారం కుదిరింది. సమావేశంలో రాష్ట్రం తరపున ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ సూపరిండెంటెంట్ ఇంజినీర్ కేకేవీ ప్రశాంత్‌కుమార్, ఈఈ జి.ప్రభాకరరావు, ఏడీఈ టి.అప్పలనాయుడు హాజరు కాగా ఒడిశా తరపున జలవిద్యుత్ ప్రాజెక్టు జనరల్ మేనేజర్(ఎలక్ట్రికల్) బిరాచి నారాయణపతాపాత్ర, డిప్యూటీ జనరల్ మేనేజర్ కృపాసింధూ బిస్వాల్, జ్యోతిర్మయిదాస్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ప్రభుల్లాజినా, ఒడిశా నీటిపారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ రమాకాంత్‌పాత్రో, చీఫ్ కన్‌స్ట్రక్షన్ ఇంజినీర్(పొట్టేరు) చంద్రశేఖర్‌విశ్రా, చిత్రకొండ ఎర్త్ డ్యాం డివిజన్ ఏఈలు అభిమన్యు ప్రధాన్, గదాధర్ ప్రధాన్ పాల్గొన్నారు.

వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్ నామినేషన్

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు: కర్నూలు, నంద్యాల జిల్లాల స్థానిక సంస్థల వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డా.మధుసూదన్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ ఈ ఎన్నికలలో పోటీ చేయకపోవడంతో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేశారు. గురువారం వైసీపీ అభ్యర్థి మధుసూదన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామసుందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేశారు. కాగా స్వంతంత్ర అభ్యర్థులుగా భూమన వెంకటేశ్వర్లు, కుమ్మరి శ్రీనివాసులు, ఎస్.మోహన్‌రెడ్డి నామినేషన్ చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్‌లు, కౌన్సిలర్‌లు మొత్తం కలిపి 1178 ఓట్లు ఉండగా, కర్నూలు డివిజన్‌లో191, ఆదోనిలో 259, పత్తికొండలో 144, డోన్ 171, నంద్యాలలో 248, ఆత్మకూరు డివిజన్‌లో 165 ఓట్లు ఉన్నాయి. మొత్తంగా మహిళ ఓటర్లు 668, పురుష ఓటర్లు 512 మంది ఉన్నారు. 6 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

వేటకొడవళ్లతో వ్యక్తిపై దాడి... పరిస్థితి విషమం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: బైక్ పై వస్తున్న వ్యక్తిపై గుర్తుతెలియని దుండగులు వేట కొడవళ్లతో దాడికి పాల్పడ్డ ఘటన నంద్యాల జిల్లాలో సంచలనం రేపింది. దాడిలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామ సమీపంలో గోరుమానుపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి పై గుర్తుతెలియని దుండగులు వేట కొడవళ్లతో దాడికి పాల్పడ్డారు. నారాయణస్వామి భోగ సముద్ర సమీపంలోని బంజారా సిమెంట్ ఫ్యాక్టరీలో టిప్పర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఉదయం డ్యూటీ ముగించుకుని బైకుపై తన స్వగ్రామం గోరుమానిపల్లెకు వస్తుండగా గ్రామ సమీపంలో దుండగులు అటకాయించి దాడికి పాల్పడ్డారు. బైక్ నుంచి కిందపడిన నారాయణస్వామి పారిపోతుండగా దుండగులు వెంబడించి కొడవళ్లతో నరికి, ప్రాణం పోయిందని భావించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడ్డ నారాయణస్వామి రోడ్డు సమీపంలోకి వచ్చి పడిపోవడంతో అటుగా వచ్చిన కొందరు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. కొన ఊపిరితో ఉన్న నారాయణస్వామిని తొలుత చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి, మరింత మెరుగైన చికిత్స కోసం అక్కడినుంచి బెంగళూరుకు తరలించారు. నారాయణస్వామికి ఇంటి దారి విషయంలో బంధువులతో ఇటీవల వివాదాలు తలెత్తడంతో వైసీపీలోని ఓ వర్గం వైపు బాధితుడు వెళ్లగా, బంధువులు మరో వర్గాన్ని ఆశ్రయించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. వివాదం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లగా పోలీసులు కూడా ఇరు వర్గాల పై బైండోవర్ కేసు నమోదు చేసి హెచ్చరించినట్లు తెలిసింది. 5నెలలుగా దారికి అడ్డంగా ఉన్న రాళ్లను తొలగించాలని ఈఓఆర్డీ దృష్టికి తీసుకువెళ్లినా అధికారులు నిర్లక్ష్యం వహించారని స్థానికులు చెబుతున్నారు.

పార్వతమ్మ మృతికి సీపీఎం సంతాపం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ జిల్లా సీపీఎం సీనియర్ నాయకులు, మహిళా ఉద్యమనేత కర్రి పార్వతమ్మ మృతికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. తిమ్మరాజు పేటలోని తన ఇంటినే కమ్యూనిస్టు కేంద్రంగా మలిచి రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారని, వీటికి జాతీయ, రాష్ట్ర నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, మోటూరు హనుమంతరావు, లావు బాలగంగాధరరావు, నండూరి ప్రసాదరావు వంటి ఎందరో నాయకులు హాజరయ్యారని వివరించారు. మహిళా జాతీయ నాయకురాలు మల్లు స్వరాజ్యం, పుణ్యవతి వారితో కలిసి మహిళా ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. సారా వ్యతిరేక ఉద్యమాన్ని ఈ ప్రాంతంలో ఉవ్వెత్తున నడిపారని, కమ్యూనిస్టు కార్యకర్తలకు మార్గనిర్దేశకులుగా నిలిచారని పేర్కొన్నారు.

రామోజీని ప్రజల ముందు నిలబెడతాం

మాజీ మంత్రి కొడాలి నాని హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అరెస్టు వ్యవహారంలో పాత ఫోటోలతో తప్పుగా ప్రచారం చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి అపకీర్తి తెచ్చిన రామోజీరావును ప్రజల ముందు నిలబెడతామని మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) హెచ్చరించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, చంద్రబాబును అమాతంగా పైకి లేపాలనే లక్ష్యంతోనే ఆయన అనుకూల మీడియా దుష్ప్రచారం చేస్తోందన్నారు. వారికి సీఎం జగన్ భయపడబోరన్నారు. నాడు చంద్రబాబును గద్దెనెక్కించడానికి ఎన్టీఆర్‌పై రామోజీ దాడి చేశారని గుర్తుచేశారు.

టిడ్కో ఇళ్లలో సదుపాయాల కోసం అమలాపురంలో సీపీఐ ధర్నా

విశాలాంధ్ర- అమలాపురం: టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలనీ, జగనన్న ఇళ్ల నిర్మాణానికి రు. 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అధ్వర్యాన గురువారం డాక్టరు బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నా చేస్తున్న వారినుద్దేశించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించి ఇస్తామని నమ్మించి ముఖ్యమంత్రి జగన్ పేదల్ని మోసగించారన్నారు. టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి అయినా ఇంతవరకూ పేదలకు ఆ ఇల్లు అప్పగించలేదన్నారు. ఆ ఇళ్లను ఆపే హక్కు జగన్‌కి ఎక్కడిదన్నారు. దాదాపు నాలుగేళ్ల క్రితం నిర్మించిన ఇళ్లను జగన్ ప్రభుత్వం నిరుపేదలకు పంచకపోవటం దారుణంగా ఉందన్నారు. ఇల్లు పూర్తి అయి కూడా నిరుపేదలు అష్ట కష్టాలు పడుతున్నారని విమర్శించారు. ఈ డిమాండ్లపై మార్చి 2న విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఆనంతరం డీఆర్ఓ సీహెచ్ సత్తి బాబుకు అందజేశారు. ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె సత్తి బాబు, నాయకులు అడపా సత్యనారాయణ, పెద్ది రెడ్డి రాము, శీలం వెంకటేశ్, నిమ్మకాయల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రంగులే మారుతున్నాయ్... రాతలు మారడంలా...

- టిడ్కో లబ్ధిదారుల దుస్థితి ఇది
- మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణలో జంగాల

విశాలాంధ్ర-గుంటూరు: పార్టీలు మారినప్పుడు టిడ్కో గృహాల రంగులు మారుతున్నాయే గాని... లబ్ధిదారుల రాత మారడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన తలపెట్టిన మహాధర్నా పోస్టర్‌ను గుంటూరులోని మల్లయ్యలింగంభవన్‌లో గురువారం పార్టీశ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తి అయిన టిడ్కో గృహాలను అన్ని హంగులతో లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం నేడు ఆ హామీని విస్మరించిందన్నారు. ఒక్క మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తప్ప రాష్ట్రంలోని మిగిలిన శాసనసభ్యులు టిడ్కో గృహాలను పంపిణీ చేయలేదని విమర్శించారు. ఏమిటీ ఈ అన్యాయమని సీపీఐ ప్రశ్నిస్తే గృహాలకు రంగులు మార్చారే గాని లబ్ధిదారులకు స్వాధీనపర్చడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే టిడ్కో గృహాలను లబ్ధిదారులకు స్వాధీనపరచాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు ఏమాత్రం సరిపోవని సీపీఐ మొదటి నుంచి చెబుతూనే ఉందన్నారు. పట్టణాలలో సెంటున్నర, గ్రామాలలో మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ పోరాటం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. టిడ్కో గృహాలను లబ్దిదారులకు స్వాధీనపరచాలని, జగనన్న ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మార్చి 2న విజయవాడలో జరిగే మహాధర్నాలో లబ్ధిదారులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని జంగాల అజయ్ పిలుపునిచ్చారు. సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే సొమ్ము సరిపోక అనేక ప్రాంతాలలోని జగనన్న కాలనీల ఇంటి నిర్మాణం మొండి గోడలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం 100 ఇళ్లు కూడా నిర్మాణాలను పూర్తి చేసుకోలేదన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, షేక్ వలి, బందెల నాసర్ జీ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోకి కాంగ్రెస్ నేత ఆకుల శ్రీనివాస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ నేత ఆకుల శ్రీనివాస్‌కుమార్ గురువారం వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. ఆయనకు సీఎం పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆకుల శ్రీనివాస్ కాంగ్రెస్‌లో వివిధ పదవులు నిర్వహించారు. కార్యక్రమంలో ఇంధన, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషగిరి పాల్గొన్నారు.

కన్నా రాజకీయ భవిష్యత్ శూన్యం

జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిన్నింటి వాసాలు లెక్కపెట్టడంలో కన్నా లక్ష్మీనారాయణ ఘనుడని, ఆయన టీడీపీలోకి వెళ్లడంతో రాజకీయ భవిష్యత్ శూన్యమని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పట్టాభి, లోకేశ్, అయ్యన్నపాత్రుడు లాంటి టీడీపీ నాయకులు తమ నోటికి ఏది వస్తే అది మాట్లాతున్నారని, సీఎం జగన్‌పైనా తప్పుడు వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుపట్టారు. పచ్చిబూతులు తప్ప ఏమీ మాట్లాడని పట్టాభి ఇంటిమీదికి 2021 ఫిబ్రవరిలో గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని...ఆ సమయంలో పట్టాభికి గాయాలయ్యాయని, ఆ ఫోటోలను గన్నవరంలో పట్టాభి అరెస్టు ఘటనకు జోడించి టీడీపీ అనుకూల మీడియాలో ప్రముఖంగా దుష్ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ వ్యవహారంపై రామోజీ క్షమాపణ చెప్పకుంటే పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు. టీడీపీలోకి కన్నా వెళ్లడంతో ఆయన రాజకీయంగా చనిపోయినట్లేనన్నారు. కన్నాను సర్వనాశనం చేసేందుకే చంద్రబాబు వ్యూహం పన్నారని విమర్శించారు.

ప్రీతి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమం

నిమ్స్ వైద్యుల ప్రకటన

హైదరాబాద్: సీనియర్ విద్యార్థుల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేసిన పీజీ మెడికల్ విద్యార్థిని ప్రీతి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా వుందని నిమ్స్ వైద్యులు ప్రకటించారు. అనేక అవయవాలు పూర్తిగా ఫెయిల్ అయ్యాయని.. వెంటిలేటర్‌పై ఉంచి, ఎక్మోపైనే చికిత్స అందిస్తున్నామని నిమ్స్ వైద్యులు పేర్కొన్నారు. ఎక్మో, సీఆర్ఆర్‌పీ ద్వారా కిడ్నీ ఫంక్షన్ చేయిస్తున్నామని డాక్టర్లు వెల్లడించారు. అయినప్పటికీ ప్రీతి పరిస్థితి అత్యంత విషమంగానే ఉందని తెలిపారు. ఇక, మహబూబాబాద్ జిల్లాకు చెందిన ప్రీతి... వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో పీజీ (అనస్థీషియా) చదువుతోంది. మహాత్మాగాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆస్పత్రిలో శిక్షణలో ఉన్న సమయంలో బుధవారం ఉదయం 6:30 గంటల ప్రాంతంలో విషపూరిత ఇంజక్షన్ చేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లుగా తెలుస్తోంది. ప్రీతిని అపస్మారక స్థితిలో ఉండటం గమనించిన ఆసుపత్రి సిబ్బంది సీనియర్ వైద్యులకు సమాచారం అందించగా, వారు ఆమెను అత్యవసర వార్డుకు తరలించి చికిత్స అందించారు. దీనిపై ప్రీతి సహవిద్యార్థులు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌లకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమై డాక్టర్ ప్రీతిని వెంటిలేటర్‌పై ఉంచి సీటీ స్కాన్‌తో పాటు అన్ని పరీక్షలు నిర్వహించామని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. పీజీ విద్యార్థి శరీరంపై తమకు ఇంజక్షన్ గుర్తు కనిపించలేదని చెప్పారు. ప్రీతిని మెరుగైన వైద్యం కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సీనియర్ విద్యార్థి వేధింపుల వల్లే ప్రీతి ఆత్మహత్యకు యత్నించిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు.

శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టివేత

విశాలాంధ్ర-హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు భారీగా బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.8 కోట్ల విలువ చేసే 14.4 కేజీల బంగారాన్ని సీజ్ చేసినట్టు కస్టమ్స్ అధికారులు తెలిపారు. గురువారం ఉదయం సూడాన్ నుంచి హైదరాబాద్ చేరుకున్న 23 మంది సూడాన్ మహిళలపై అనుమానం రావడంతో అధికారులు వారిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వారిలో నలుగురి వద్ద అక్రమ బంగారం కలిగి ఉన్నట్లు గుర్తించారు. వీరు తమ లగేజీలతో పాటు వారు ధరించిన బూట్లలో బంగారాన్ని తరలిస్తున్నారు. ఏమాత్రం అనుమానం రాకుండా బంగారాన్ని షూ, పాదాల కింద, బట్టల మధ్య లో దాచి తరలించే యత్నం చేశారు. కాగా అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారం విలువ దాదాపు రూ.8 కోట్లు ఉంటుందని అంచనా.

బుద్ధవనానికి ప్రత్యేక బస్సులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చారిత్రాత్మక ప్రదేశమైన బుద్ధవనం మ్యూజియానికి ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. పల్నాడు జిల్లా మాచర్ల, పిడుగురాళ్ల డిపోలను, బస్ స్టేషన్లను గురువారం ఎండీ సందర్శించారు. ప్రతి విభాగాన్ని పరిశీలించి, ఉద్యోగులతో మాట్లాడారు. అనంతరం బస్‌స్టేషన్లలోని ప్లాట్‌ఫారం, బస్సుల నిర్వహణ తదితర అంశాలను గమనించి ప్రయాణికులకు కల్పిస్తోన్న సౌకర్యాలపై ఆరా తీశారు. రెంటచింతల, గురజాల, దాచేపల్లి బస్‌స్టేషన్లనూ ఆయన సందర్శించారు. దీంతో అక్కడున్న నిర్వాహకులు, యాత్రీకులు ఆర్టీసీ ఎండీని కలిసి విజయవాడ, గుంటూరు తదితర ప్రదేశాల నుంచి బుద్ధవనానికి బస్సులు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని సూచించారు. ఈ బుద్ధ వనానికి సమీపాన తొమ్మిది కిలోమీటర్ల దూరంలో నాగార్జున సాగర్, నాగార్జునకొండ కూడా ఉందని వివరించారు. పర్యాటకులకు కనువిందు చేసేలా ఈ ప్రాంతాలకు బస్సు ఏర్పాటు చేయడం వల్ల ఆర్టీసీ అదనపు ఆదాయం పెంచుకునే అవకాశముంటుందని సూచిం చారు. దీనిపై ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ బుద్ధవనానికి తక్కువ చార్జీలతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ బస్సులను పాఠశాల, కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి ధాన్యపు గింజ కొనాలి

రైతు సంఘం నాయకుల డిమాండ్

విశాలాంధ్ర- గన్నవరం: రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట కార్యదర్శులు పి. జమలయ్య. ఎం.యల్లమందారావు డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని రైతు భరోసా కేంద్రాలను రైతు సంఘం నాయకులు గురువారం సందర్శించారు. బుద్ధవరం, చిక్కవరం, బీబీ గూడెం, తెలప్రోలు, ఉంగుటూరు గ్రామాల రైతు భరోసా కేంద్రాలను వారు పరిశీలించారు. ఆయా గ్రామల రైతులను కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ బుద్ధవరం గ్రామంలో 3,300 ఎకరాలలో పంట సాగు చేస్తే 37,500క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తే 19వేల క్వింటాలు మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. బుద్ధవరం గ్రామ రైతు భరోసా కేంద్రంలో రూ 4 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేస్తే రూ.2కోట్లు మాత్రమే చెల్లించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 21 రోజులలో రైతుల ఖాతాలో జమ చేస్తామని చెప్పి ఇప్పటికి 50 రోజులు అవుతున్నా సకాలం చెల్లించలేదన్నారు. ప్రభుత్వం ధాన్యం డబ్బులను వడ్డీతో సహా రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు తమకు రావాల్సిన డబ్బుల కోసం రోజుల తరబడి భరోసా కేంద్రం చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా 30 శాతం ధాన్యం రైతుల దగ్గరే ఉందన్నారు. ధాన్యం కొనకుండా కొనుగోలు కేంద్రాలలో ఆన్‌లైన్ చేయటం ఆపేశారని చెప్పారు. నగదు సకాలంలో రైతుఖాతాలో జమ కాకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రైతు తీసుకున్న అప్పులకు సంబంధించి బ్యాంకులకు సకాలంలో చెల్లించకపోతే వడ్డీ రాయితీరాదని, రైతులు తద్వారా నష్టపోతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం పండిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. రైతు సంఘం కార్యదర్శి మల్నీడు యల్లమందారావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేయడానికి మార్చి నెల ఆఖరిదాక సమయం ఇవ్వాలన్నారు. రైతు భరోసా కేంద్రాలు కొనుగోలు చేసి ఆన్‌లైన్లో నమోదు కాని ధాన్యం చాలా ఉందన్నారు. ప్రభుత్వం బాధ్యత తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. రైతు సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు వెలగపూడి ఆజాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకారం17 శాతం తేమ శాతం ఉండాలని ధాన్యం మిల్లర్లకు తోలిన తరువాత తేమ శాతం ఎక్కువగా ఉందని చెప్పి తగ్గించడం వలన క్వింటాలుకు రూ. 200 వరకు నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుసంఘం వర్కిగ్ ప్రసిడెంట్ ముక్కామల ఉమామహేశ్వ రావు, గన్నవరం ఏరియా రైతు సంఘం నాయకులు కాట్రగడ్డ రామచంద్ర జోషి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ప్రాజెక్టులు పట్టవా?

రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో అత్యంత నిర్లక్ష్యానికి గురైన రంగమేదైనా వుందంటే అది వ్యవసాయమే. ముఖ్యంగా వ్యవసాయానికి ఊతమిచ్చే సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడూ లేనంత అలక్ష్యాన్ని వహించింది. నిజానికి తెలంగాణ రాష్ట్రం అవతరించిన తర్వాత ఆ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పని ఎంత వేగంగా ముందుకుపోయిందో, ఏపీలో అంత వేగంగా వెనక్కిపోయింది. ఈ విషయాన్ని ప్రభుత్వ గణాంకాలే చెపుతున్నాయి. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాల్లో భాగంగా చేపట్టిన జలయజ్ఞం ఒక్కడుగు ముందుకేసినా గొప్ప విషయమే. పోలవరం, పట్టిసీమ, గాలేరు నగరి, హంద్రీ నీవా, వెలిగొండ, పురుషోత్తపట్నం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయడమే జలయజ్ఞం లక్ష్యం. కానీ ఏ ఒక్క దశ కూడా ముందుకు సాగలేదు. నీటి పారుదల శాఖ కార్యాలయంలో మంత్రి, ఆయన బలగాలకు అసలు పనే లేకుండా పోయింది. దీంతో మంత్రి తన పనివదిలేసి ప్రతిపక్షాలను తిట్టే పనిలో వున్నారు. ఈ నేపథ్యంలో భారత కమ్యూనిస్టుపార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఇటీవల చేపట్టిన ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమం అత్యంత విజయవంతమైంది. గడిచిన నాలుగేళ్లలో ప్రాజెక్టులు ఒక్క అంగుళం కూడా ముందుకు కదల్లేదన్న నిజాన్ని సీపీఐ బృందం ఎత్తిచూపింది. నీటి ప్రాజెక్టులపై సర్కారు నిర్లక్ష్యాన్ని ఎండగట్టింది. ఫిబ్రవరి 13 నుంచి 22 వరకు సాగిన సీపీఐ ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమంలో రాష్ట్ర ప్రాజెక్టులకు సంబంధించిన చాలా నిజాలు వెలుగుచూశాయి.

నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఒక్క కాలువ తవ్విన సందర్భం లేదు. కర్నాటకలోని తుంగభద్ర ఎగువ భాగాన ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మిస్తే భవిష్యత్‌లో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిసినా వైసీపీ ప్రభుత్వం నోరుమెదపడం లేదు. ఎగువభద్రకు కేంద్ర ప్రభుత్వం ఏకంగా 5,300 కోట్ల రూపాయలు కేటాయించి, జాతీయ హోదా కల్పించినా జగన్ నుంచి ఎలాంటి స్పందన లేదు. పైగా అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలకు జీవనాధారమైన తుంగభద్ర నికర జలాలకు ఇది గండికొట్టడమే. తుంగభద్ర జలాశయమే అనంత, కర్నూలు జిల్లాల ప్రజల తాగునీటి ఆధారం. కర్నాటకలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అక్కడి బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా ఎగువభద్ర ప్రాజెక్టును చేపట్టడం, పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినప్పటికీ ఎనిమిదేళ్లుగా ఉలకని పలకని మోదీ సర్కారు దీనికి మాత్రం కొన్ని క్షణాల్లోనూ తలూపడం, నిధుల వర్షం కురిపించడం ఎన్నికల తంత్రమే.

వేదవతి, గుండ్రేవుల, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌లు నిధుల కోసం ఆవురావురమంటున్నాయి. కరువుపీడిత ప్రాంతాలకు ఉపకరించే వేదవతి ప్రాజెక్టు నుంచి ప్రతి యేటా 30 నుంచి 40 టీఎంసీల నీరు వృథా అయిపోతోంది. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1942 కోట్లు ఖర్చవుతుందని స్వయంగా ప్రభుత్వమే నిర్ణయించినా, రూ.16 కోట్లు మాత్రమే విడుదల చేయడం సిగ్గుచేటు. ఇలా యేటా రూ.16 కోట్లు విడుదల చేస్తే, ఆ ప్రాజెక్టు పూర్తికావడానికి 121 సంవత్సరాలు పడుతుంది. భూసేకరణ చేశారు, పరిహారం మరిచారు. మలగవెల్లి జలాశయం పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. 20 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యమున్న గుండ్రేవుల ప్రాజెక్టుకు అనుమతిలిచ్చి పదేళ్లయినా ఒక్క సిమెంటు బస్తా కూడా వేయలేదు. దీన్ని పూర్తిచేసివుంటే, కేసీ కెనాల్ ఆయకట్టుకు, కర్నూలు నగర తాగునీటికి ఇబ్బందులు ఉండేవికావు.

రతనాల రాయలసీమను రాళ్లసీమగా మార్చిన ఘనత ఈ ప్రభుత్వాలదే. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లు ఈ పాపంలో జగన్ ప్రభుత్వ పాత్ర సింహభాగమే. రిజర్వాయర్లన్నీ నీళ్లతో నిండుకుండల్లా వున్నా, వాటిని అనుసంధానించే పిల్లకాల్వలు లేక సాగుకు నీళ్లు అందివ్వలేని పరిస్థితి దాపురించింది. గండికోట రిజర్వాయర్‌లో 26 టీఎంసీల నీరు నిల్వవున్నా పిల్లకాల్వలు లేక ఈ ప్రాంతం ఎండమావిలా గోచరిస్తూ వుంటుంది. గాలేరు నగరి సుజల స్రవంతి శిలాఫలకం దర్శనీయస్థలమే. కరటంబాడు ప్రాజెక్టు వద్ద 1988లో ఎన్టీఆర్ వేసిన శిలాఫలకమే నేటికీ దర్శనమిస్తుంది. దానికి రంగులు మాత్రం వేశారు. ప్రాజెక్టు కదలిక అంతంతమాత్రమే. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం వర్తింపచేయడానికి జాప్యమేల? ఈ ప్రశ్నకు ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. ఈ ప్రాజెక్టు పరిధిలోని 11 ముంపు గ్రామాలకు ప్రభుత్వం ఇస్తామన్న ఆర్‌ఆర్ ప్యాకేజీ కూడా ఇవ్వకపోవడం దారుణం. నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగునీరు, 16 లక్షల ప్రజానీకానికి తాగునీరు అందించడమే గాకుండా 32 మండలాలను సస్యశ్యామలం చేయాలన్నదే వెలిగొండ ప్రాజెక్టు ఉద్దేశం. మొదటి సొరంగం పూర్తయినా, రెండో సొరంగం ఇంకా 2.5 కిలోమీటర్ల పని ఆగిపోయింది. అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తానని చెప్పిన జగన్ ఒక్క పార మట్టి తీయలేదు.

ఇక పోలవరం సంగతి సరేసరి. కృష్ణా, గోదావరి నదుల అనుసంధానంపై 26 జిల్లాల ప్రయోజనాలు ఆధారపడివున్నాయి. పోలవరం పూర్తయితే 7 లక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు, పట్టణాలకు తాగునీరు, ఉత్తరాంధ్ర, రాయలసీమకు నీరు లభిస్తుంది. రాష్ట్ర విభజన సమయంలో దీన్ని జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం ప్రకటించినా, ఆ తర్వాత వచ్చిన మోదీ వ్యవహారం మాత్రం దుర్మార్గంగా వుంది. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, పోలవరంపై రూ.2900 కోట్లు ఖర్చుచేశామని, ఆ నిధులు ఇవ్వాలంటూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు తెలుగు ప్రజల జీవనాడి. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారశైలి, నటనాచాతుర్యం జుగుప్సాకరం. సీడబ్ల్యూసీ ఆమోదించినా, ప్రాజెక్టు అథారిటీ సిఫార్సు చేసినా.. ప్రాజెక్టు మాత్రం నత్తనడకే. ప్రతిరోజూ దీనిపై మాట్లాడుకోవడం ఓ ప్రహసనంగా మారిపోయింది. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్వాసితులు అన్నమో రామచంద్రా అంటూ అడుక్కుంటున్నా.. ప్రభుత్వం కళ్లకు కనపడటం లేదు. ఎంగిలి మెతుకులు విసిరినట్లు పరిహారం ఇవ్వడానికి, నిర్వాసితులపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రభుత్వం సరికొత్త కుట్రకు తెరతీస్తోంది. ఇదొక చిన్న ప్రాజెక్టు. పదిహేనేళ్లయినా దీనికి దిక్కూమొక్కూ లేకుండా పోయింది. తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు స్థితీ అంతే. ఈ ప్రాజెక్టు పరిధిలో రూ.90 కోట్లతో మూడు గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సి వున్నా అతీగతీ లేదు. ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పడి ఏడుస్తున్న ఏపీ ప్రాజెక్టుల సాధనకు కొత్త ఉద్యమం అనివార్యం, అవశ్యం.

పాదయాత్ర

రా బావ అడుగులు లెక్కపెట్టుకుంటూ వస్తున్నావు. ఏంటీ కద. ఆ ఏముంది నేను కూడా పాదయాత్ర చేద్దామని. పాదయాత్ర చేసే వాడివి ఆలా నిదానంగా అడుగులు లెక్కపెడ్తూ నడుస్తున్నావేంటి. అదే చెబుతా వామనుడు మూడు అడుగులలోనే శత్రు సంహారం కావించాడుకద. వై.ఎస్.ఆర్, జగన్‌లా ప్రస్తుతం పాదయాత్రచేస్తున్న లోకేష్‌లాగ వేల కిలో మీటర్లు నడవనవసరంలేదు. భలేవాడివయ్యా యింతకీ నీ పాదయాత్ర ఎవరికోసం, ఎవరిని సంహరించడానికి. వారందరూ అధికారంలో ఉన్నవారిని దించడానికి, సీట్ల కోసం చేశారు. నేను ప్రజల కోసం చేస్తా. సరిగా ఏడడుగులు లెక్కపెట్టి నడచి ఏడు వాగ్బాణాలు సంధిస్తా. వాటికి ప్రభుత్వం, ప్రతిపక్ష నాయకులు ఎవరైనా సమాధానంచెబితే నేను నడచిన ఏడడుగులు వెనక్కి వేస్తాం. లేకపోతే ఈ ఎన్నుకున్న ప్రజలకు క్షమాపణ చెప్పి అసెంబ్లీ రద్దుచేసి గద్దెదిగి పోవాలనేది నా షరతు. భలేవాడివయ్యా బావ ధర్నాలు చేసి పాణాలర్పించినా దిక్కులేదు నీ ప్రశ్నలకు విలువిచ్చి విసిగిపోతానా చెప్పు. అదంతా పాతకాలం. పొట్టిశ్రీరాములు ప్రాణం పోయాకే నెహ్రూ కళ్లు తెరిచాడు. లక్షల ప్రాణాలతోపాటు దేశానికి విలువైన బోసులాంటి నాయకులు కనుమరుగయ్యాకే బ్రిటీషువారు దిగివచ్చారు. అవన్నీ పాత పద్ధతులు. నేను పేపర్ల విలేకరులను పిలిచి

ప్రెస్‌క్లబ్బుల వద్ద నా విధానం వివరించి ఏడడుగులు నడుస్తా.

ఓ పిచ్చి బావ అసలు నిన్ను పట్టించుకునేవాడెవడు నీ ప్రశ్నలు వినేవాడెవడు. భలే వాడివయ్యా ప్రస్తుతం పాదయాత్ర చేస్తున్నవారి మాటలు మాత్రం వింటున్నారో చెప్పు. నిజమే ప్రస్తుతం లోకేష్ యాత్ర జోకేష్ కామెడిగానే పరిగణిస్తున్నారు. ఒకవైపు తండ్రి చంద్రబాబు, మరోవైపు కొడుకు లోకేష్ బాధ కొద్దీ అరుస్తూ మాట్లాడుతున్నారు. అదే నేననేది ఆ బాధ పదవి పోయిందనా..ప్రజలకు అన్యాయం జరిగిందనా.. అదేంటి ప్రజలకు అన్యాయంజరగలేదా అంటే నీఉద్దేశం జగన్ ప్రభుత్వం లోనే జరిగిందనా బాబు ప్రభుత్వంలో జరగలేదా. అందుకే వారంతా సొమ్ములు ఖర్చుపెట్టి కిరాయి జనంతో పాదయాత్ర చేస్తున్నారు. నేనలా ప్రజల సొమ్ము తినలేదు కనుక కిరాయి మనుషులు అవసరం లేదు. ప్రజలకోసం ఏడడుగులు వేయగానే మరో ఏడువేలమంది ప్రజలు అనుసరిస్తారు. ఎందుకంటే నేను చేసే పాదయాత్ర పార్టీ కోసమని వారు గ్రహిస్తారు. అవి సరే వాళ్లలాగ నీవు బూతులు మాట్లాడగలవా. అదే నే చెప్పేది ప్రజలు అసహ్యంతో మూతిముడుస్తూ ముక్కున వేలేసు కుంటున్నారు. చివరకు రాజకీయాలు ఇలా తయారైనందుకు బాధపడు తున్నారు. ఇంతేకదా ఎదురుపడి తిట్టుకోవడం లేదుకదా. అసలు అసెంబ్లీలో కొట్టుకుంటున్నారు. చొక్కాలు చింపు కుంటున్నారు. ద్రౌపది వస్త్రాలు ఊడదీసినట్లు మేమూ భారతీయులమే కౌరవుల సహోదరులమే అని నిరూపిస్తున్నారుగ. అదంతా గతం నేను ఏడడుగులు నడవగానే మహాత్మాగాంధీ, అబ్రహంలింకన్ యాత్రలు గుర్తుకొచ్చి ప్రజలు సమస్యల చుట్టూ చేతబట్టుకుని నన్ను అనుసరిస్తారు. వీవే చూస్తావుగ. వద్దు ఇంత దూకుడువద్దు నువే అంటున్నావుగా పాత ప్రజలు కాదని. కొత్త రోజులను బట్టి ఎనిమిదో అడుగువేయకుండానే నిన్ను నువుచెప్పే కిరాయిగుండాలు నిన్ను లేపేస్తారు. అంతేనంటావా మరి ఏం చేయాలంటావు. ఏం చేయా లంటే వాళ్లు చెప్పేదివిని ప్రజలు మారిపోయి ఓటువేస్తారనుకోవడం వాళ్ల భ్రమ. ప్రజలు పిచ్చివాళ్లు మనం చెప్పేది విని మారిపోతారని అనుకునే ఈ నాయకులే పిచ్చివాళ్లు. పాతరోజులు కాదు నాయకులు చెప్పేది నమ్మడానికి. గురివింద గింజ దానికింద నలుపువారికి తెలియకపోయినా ప్రజలు పేపర్లు చదవడం అలవాటయినా అన్ని విషయాలు తెలుసు కుంటున్నారు. బతకలేని నాయకుడు వేలకోట్లు సంపాదించి తన ఉపన్యాసానికి చప్పట్లు కొట్టడానికి,ఈలలు వేయడానికి కిరాయి జనాన్ని తెచ్చుకున్నారని కూడ ప్రజలకు తెలుసు. అందుకే బావ విలేకరుల సాక్షిగా ఏడడుగులు నడచి నాతో వచ్చినవారిని ఇంటింటికి పంపించి ఏ ప్రభుత్వం ప్రజలకు అన్యాయంచేసి ఎలా దోచుకుందో వివరించే ఏర్పాటు చేస్తా. అంతా కొత్తవారు పోటీలో ఉండేట్లు చేస్తా. నవతరం నవయుగ కూలీలుగా ప్రజలకు నచ్చజెప్పి కొత్తవారిని ఎన్నుకునేలా ప్రజలను మారుస్తాయి. అది సరే ఎన్‌టీఆర్‌తో కొత్తపార్టీ పెట్టినప్పుడు సినిమా హీరో అయితే గెలుస్తాడా అని ముఖంచాటేస్తే దాదాపు 70శాతం కొత్త వారిని నిలబెట్టి గెలిపించాడు యన్.టి.ఆర్. అయితే ఆయనవల్ల గెలిచి, ఆయన్ని దించే వారితో చేతులు కలిపారు. కాలం మారింది. ఆ విషయం గమనించి అడుగు ముందుకువేయాలి. అది కాదు బావ నా ప్రణాళిక ఏమిటంటే ప్రతి ఇంటికి వెళ్లి ఏ ప్రభుత్వం ఏమి చేసింది. ప్రజల అవసరాలు ఎవరు గుర్తించి అవితీర్చే దిశలో పనిచేశారో నా బృందం వివరించి ప్రజల్లో చైతన్యం తెస్తుంది. అది సరే ప్రధాన పార్టీలవారు కిరాయికి మనుషుల్ని తెస్తే సొంత డబ్బు ఖర్చు పెట్టుకుని చేసేవారు దొరుకుతారా. ఆవేశంతో అడవులపాలై ప్రాణాలు వదిలే నక్సలైట్లు నా విధానం నచ్చి అనుసరిస్తే మార్పుతప్పక వస్తుంది. అది సరే మాకు కావలసింది పార్టీలు కాదు ప్రజలు. పార్టీలలో సంస్థలలో ఉన్నది మనుషులేకదా. వారు మారకుండా పార్టీలుమారి ఉపయోగంలేదు. ప్రస్తుతవ్యవస్థ మారాలంటే ప్రాధమికంగా సమాజానికి, వ్యవస్థకు కేంద్రబిందువైన మనిషి మారాలి. అప్పుడే వ్యవస్థ మారేది. అది నిజమే నువు అర్థం చేసుకోవడం లేదు. నా ఉద్యమం అదే. ఇంటింటికి వెళ్లి వారి ఇంటి అరుగుమీద కూర్చుని వారి సాదక బాధలు విని మనం ఏం చేయాలో వివరిస్తాం. అసలు ఆ విషయం తెలియగానే పోలీసులు ముద్రగడను ఆపినట్లు నిన్ను హౌస్‌అరెస్టు చేస్తే మీరందరూ బైటకు ఎలా వెడతారు. అందుకే మేథావులు తలపట్టుకుని ఇంటికి పరిమిత మయ్యారు. అన్నింటికి అన్ని చెబుతావు మరి ఏం చేయాలని. అన్నింటికీ అన్నీచెబుతారు మరి ఏంచేయాలి. తొందరపడకు. కడుపు మండిననాడు (ప్రజలే) తిరగబడి ఓటు ద్వారానే సాగనంపుతారు

సెల్: 9885569394

జన్యుమార్పిడితో ప్రజారోగ్యం నాశనం

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆహార డిమాండ్‌తో వ్యవసాయ ఉత్పత్తి 2050 నాటికి 70శాతానికి విస్తరించాలి. అయితే ఫుడ్ అండ్ ఎగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ అంచనాప్రకారం, ప్రతిఏటా ప్రపంచంలోని 40శాతం పంటలు తెగుళ్లవలన నాశనం అవుతున్నాయి. వాతావరణ మార్పులతో ఇది మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. అయితే కలుపు నివారణ మందులను, జన్యుమార్పిడి హైబ్రిడ్ విత్తనాలను అమ్ముకోవాలనీ, లాభాలను దండుకోవాలనీ కంపెనీలు తహతహ లాడుతున్నాయి. కలుపునివారణ మందులవలన భూమి విషతుల్య మౌతుందనే వాస్తవాన్ని ప్రభుత్వం కాదనలేకపోతున్నది. ఒక పక్క ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం అంటూ ప్రచారంచేస్తూ మరోపక్క భూమిని, భూసారాన్ని, ప్రజారోగ్యాన్ని నాశనంచేసే జన్యుమార్పిడి పంటలకు, కలుపు మందుల పంటలకు అనుమతులనిస్తున్నది. భూమికి, ప్రజల ఆరోగ్యానికి ప్రమాదమన్న రుజువుల కారణంగా గ్లైఫోసేట్ కలుపు నివారణ మందులను నిషేధించక తప్పలేదు. ప్రభుత్వ వైఫల్యం వలన ప్రమాదకరమైన నిషేధిత మందులుకూడా మార్కెట్లో అమ్ముతున్నారు. కలుపుమందులు అమ్ముకోవటానికి వీలుగా విత్తనాలనే జన్యుమార్పిడి చేశారు. కలుపు మందులతో భూమికి, మనిషికి, పశువులకు, వాతావరణానికి ప్రమాదమని నిర్ధారించి నిషేధించారు. మరోప్రక్క హెర్బిసైడ్ టాలరెంట్ జన్యుమార్పిడి ఆవాల పంటలకు అనుమతిచ్చి హెర్బిసైడ్ కలుపు నివారణ మందులను యధేచ్ఛగా వాడుకోమంటున్నారు. బీజేపీ ఎన్నికల ప్రణాళికలలో ఆహారంలో జన్యుమార్పిడి పంటలను, హెర్బిసైడ్ కలుపు నివారణ మందులకు అనుమతులు ఇవ్వమన్నారు. ఆచరణలో జన్యుమార్పిడి పంటలకు హెర్బిసైడ్ కలుపు నివారణ మందుల వ్యాపార కంపెనీలకు స్వేచ్ఛనిచ్చి ప్రజలను మోసం చేస్తున్నారు. జన్యుమార్పిడి పంటలతోపాటుగా హెర్బిసైడ్స్ వాడకంతో భూమి నాశనమవటం, ఏ మందులకూ లొంగని "సూపర్ వీడ్స్", "సూపర్ వీడ్స్" అభివృద్ధి చెందుతున్నాయి. ఇంకా ఎక్కువ పురుగుమందులువాడే అవసరంపెరిగి భూమి, పర్యావరణం మరింతగా నాశనమై ప్రకృతివిచ్ఛిన్నమై కాన్సర్ లాంటి జబ్బులతో మానవుని మనుగడ ప్రశ్నార్థకమౌతున్నది.

జన్యుమార్పిడి ఆవాల పంటవలన ఆవాల దిగుబడి పెరిగి ఆవనూనె దిగుమతులను తగ్గించవచ్చనీ, విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయవచ్చనీ ప్రభుత్వం అసత్యప్రచారం చెప్తోంది. 1980లో ఆయిల్‌మిషన్ ఇచ్చిన ప్రోత్సాహంతో వంటనూనెల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. సాంప్రదాయ హైబ్రిడ్‌విత్తనాలతోనే హెక్టారుకు 3012కేజీల దిగుబడిని రైతులు సాధించారు. డిఎంహెచ్ -11 జన్యుమార్పిడి విత్తనాలతో 30శాతం అధికదిగుబడిని సాధించవచ్చని ప్రభుత్వం అసత్యప్రచారంచేస్తున్నది. రుజువులను చూపించలేక పోతున్నది. ఎన్‌డిడిబి-డిఎంహెచ్1 సాంప్రదాయ విత్తనంతో 2924 కేజీల దిగుబడిని, ఎన్‌డిడిబి-డిఎంహెచ్4 సాంప్రదాయ విత్తనంతో 3012 కేజీల దిగుబడిని సాధించారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారంచేస్తున్న జన్యుమార్పిడి హెర్బిసైడ్ టాలరెంటు విత్తనం జీఎమ్ మస్టర్డ్ వలన 2626 కేజీల దిగుబడి మాత్రమేవచ్చింది. అదేమంటే మీరు సైన్సుకువ్యతిరేకం అని దబాయిస్తున్నారు. ఆవనూనెను దక్షిణ భారతదేశంలో వాడరు. ఆవనూనెను ఉత్తర భారతదేశంలో విరివిగా వాడతారు. విస్తారంగా పండిస్తారు. మనదేశంలో వంటనూనెల ఉత్పత్తిలో 40శాతం ఆవనూనెదే. ఆవపంట 80లక్షల ఎకరాల్లో 60 లక్షల మంది రైతులు సాగుచేస్తున్నారు. 1993-1994లోనే, ఆవనూనెలో స్వయంసమృద్ధిని సాధించారు. దేశీయఉత్పత్తి అన్ని అంతర్గత అవసరాలను తీర్చింది. ఆవనూనె దిగుమతి అవసరంలేదు. దక్షిణ భారతదేశంలో ఆవనూనె వాడకం చాలా తక్కువ. ఊరకనే ఇచ్చినా వాడరు. తక్కువ ఉత్పత్తివుండి, ఎక్కువమంది ప్రజలువాడే పామాయిల్, వేరుశనగనూనె, నువ్వులనూనె, కొబ్బరినూనెలకు ప్రోత్సాహం కరువైంది. ప్రభుత్వ ప్రోత్సాహం ఉన్నప్పుడు రైతులు అనూహ్యమైన ఫలితాలు సాధిస్తున్నారు.

విదేశాల నుంచి దిగుమతిచేస్తున్న పామాయిల్, సన్ ఫ్లవర్ వంటనూనెలకు దిగుమతి సుంకాలను తగ్గించి సింగపూర్, ఇండోనేషియా, ఉక్రెయిన్ ప్రభుత్వాలకు సహాయం చేస్తున్నారు. మన దేశంలోని పామాయిల్, వేరుశనగ, నువ్వులనూనె, కొబ్బరినూనె రైతులకు కనీస మద్దతుధరకు చట్టపరమైన గ్యారంటీ లేదు. లాభసాటి ధర, గిట్టుబాటు ధరల మాటేలేదు. ప్రకృతి వైపరీత్యాలతో రైతుకు దిక్కేలేదు. బీటీ కాటన్ వలన కలిగిన దుష్పరిణామాలన్నిటికీ మోన్శాంటో లాంటి బహుళజాతుల సంస్థలే కారణం అని ప్రజలు గుర్తిస్తున్నందున కార్పోరేట్ సంస్థలు కొత్తముసుగులో ప్రవేశిస్తున్నాయి. బార్, బార్నేజ్, టెక్నాలజీని దిల్లీ యూనివర్సిటీ అధ్యయన బృందం మనదేశంలో పబ్లిక్‌సెక్టార్ రంగంలో కొత్తగా కనుగొన్నట్లుగా ప్రచారం చేస్తున్నారు. బార్, బార్నేజ్, టెక్నాలజీపై బేయర్స్ కంపెనీకి పేటెంట్ వుంది. 2001లో బార్నేజ్, బార్‌స్టార్ టెక్నాలజీని బేయర్స్ కంపెనీ వాడింది. యూరప్‌లో జన్యుమార్పిడి ఆహారాలను తినరు. పంటలకు అనుమతిలేదు. యూరప్ దేశాలు జీఎమ్ పంటలను గట్టిగా వ్యతిరేకించాయి. యూరప్ ప్రజలు తినని ఆహారం మనం ఎందుకు తినాలో ప్రభుత్వం చెప్పాలి. తినే ఆహారంలో విషతుల్యమైన జన్యుమార్పిడి పదార్థాలున్నాయేమో అని అమెరికా ప్రజలు అనుమానిస్తున్నారు. ఆహార పదార్థాలపై జీఎమ్ లేబుల్స్ అతికించమని ప్రజలు ఆందోళన చేస్తున్నారు. అమెరికాలో శక్తిమంతమైన విత్తనసంస్థల వత్తిడికి లొంగి మాన్శాంటో, బేయర్స్ కంపెనీలకు అనుమతులు, పేటెంట్లు ప్రభుత్వం మంజూరుచేసింది. మనదేశంలో జన్యుమార్పిడి పంటలను, ఆహారాన్ని అనుమతించబోమని ఎన్నికల ప్రణాళికలో స్పష్టంగాచెప్పిన బీజేపీ, ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత పంధా మార్చుకుంది. ఎమ్ఎస్‌సీల వత్తిడికి ప్రభుత్వం లొంగిపోయింది. ఆర్‌యస్‌యస్ అనుబంధ సంస్థయిన స్వదేశీ జాగరణమంచ్ జన్యుమార్పిడి ఆవాలను వ్యతిరేకించింది. అయినా విత్తన కార్పొరేట్ కంపెనీలు తమ అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి శక్తినిచూపి ధారా మస్టర్డ్ హైబ్రిడ్ డిఎమ్‌హెచ్-11 కు అనుమతులను పొందాయి. అమెరికాలో "లైబిలిటీ లా" వుంది. పరిశోధనల ఫలితాలకు భిన్నంగా దుష్ప పరిణామాలు సంభవిస్తే ఎవరు బాధ్యులో నిర్ణయించి తగిన చర్యలు చేపడతారు. మనదేశంలో మీకేమీ కాదన్న ప్రభుత్వం, దిగుబడులు పెరుగుతాయన్న కంపెనీలు, ఆరోగ్యానికి ఢోకా లేదన్న జీఈఏసీ సభ్యులు, ప్రభుత్వం-ఎవరిదీ బాధ్యత? 2015లో ప్రపంచ ఆరోగ్యసంస్థ గ్లైఫోసేట్ను "మానవ క్యాన్సర్‌కు ముఖ్య కారణం" గా వర్గీకరించింది. నాన్ హాడ్కిన్స్ లింఫోమా సహా 10రకాల క్యాన్సర్లకు కారకమైన గ్లైఫోసేట్ ఆధారిత హెర్బిసైడ్ వినియోగదారులకు నష్టపరిహారం చెల్లించనందుకు మోన్‌శాంటో/బేయర్ కంపెనీపై లక్షకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. జీన్ క్యాంపెయిన్ జన్యుశాస్త్రవేత్త డాక్టర్ సుమన్ సహాయ్ మాట్లాడుతూ, దేశంలో మొట్టమొదటి వాణిజ్య బీటీ పత్తిపంటకు సంబంధించిన భద్రతా డేటా ఏదీ పబ్లిక్‌డొమైన్‌లో ఉంచలేదన్నారు. అక్టోబర్ 25, 2022న పర్యావరణ విడుదలకు ఆమోదం లభించిన జీఎమ్ ఆవాలకు కూడా అదే విధానాన్ని అవలంబించి విత్తనాల విడుదల తర్వాత అవసరమైన పరీక్షలు నిర్వహిస్తారా? మన దేశంలో జీఎమ్ ఆవాలు పండించడానికి అన్ని అడ్డంకులు తొలగిన తరువాత ఇతర జీఎమ్ పంటలకు కూడా వరద గేట్లను తెరుస్తారు. బీటీ వంకాయ, బీటీ బెండ, గోల్డెన్ రైస్, వరి, గోధుమ, మొక్కజొన్న, బంగాళాదుంప-అన్నిటిలో కాస్తోకూస్తో జన్యుమార్పుచేసి వ్యవసాయ వ్యాపారాన్ని పెంచుకోవటానికి కార్పోరేట్ కంపెనీలు కాచుకు కూర్చున్నాయి. ప్రపంచ ద్రవ్యపెట్టుబడిని ఎదిరించలేని ప్రభుత్వాలన్నీ లొంగిపోయి మాన్శాంటో, బేయర్స్‌లాంటి కంపెనీలను ఆహ్వానిస్తున్నాయి. జీఎమ్ ఆవాలు ప్రవేశపెట్టటానికి బలమైన అమెరికా ఒత్తిడి వున్నదని జర్నలిస్టు రష్మీ సెహగల్ అంటున్నారు.

మన దేశంలో వ్యవసాయం ఒక జీవన విధానం. 66 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. 53శాతం ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నది. దేశ ఆదాయంలో వ్యవసాయ ఆదాయం క్రమేపీ 15శాతానికి తగ్గింది. జన్యుమార్పిడి పంటలు మననేలను, నీటిని కలుషితం చేస్తాయి. ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతుంది. ఈ ప్రక్రియ కోలుకోలేనిది. వివిధ వాతావరణ పరిస్థితులున్న భారతదేశం జీవవైవిధ్యానికి ప్రసిద్ధి చెందింది. వైవిధ్యమైన జన్యు వనరులున్నాయి. మన విత్తనోత్పత్తి చాలా శక్తిమంతమయినది. మన రైతులు ప్రపంచంలోనే అతిపెద్ద విత్తనోత్పత్తిదారులు. జీవ వైవిధ్యం మన బలాలలో ఒకటి. అది నాశనంచేసి ఒకటే దేశం, ఒకటే విత్తనం, ఒక్కటే పంట అంటూ విశాల భూ క్షేత్రాలలో మోనోక్రాప్‌తో కోర్పోరేట్‌స్థాయి వ్యవసాయంవైపు నడిపిస్తున్నారు. వ్యవసాయంలో వున్న వారిలో సగం మందికి సెంటు భూమి కూడా లేదు. ఇప్పటికే 86శాతం మంది చిన్న రైతులు ఒత్తిడిలో ఉన్నారు. జీఎమ్ సాంకేతికత పేరున కంపెనీలు దారుణంగా పెంచుతున్న రేట్లలో ఖరీదైన జీఎమ్ విత్తనాలను కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నారు. పెరుగుతున్న ధరలతో ఎరువులను కొనలేరు. పెంచనున్న విద్యుత్ చార్జీలను భరించలేరు. అప్పులను కట్టలేరు. కనీసధరకు చట్టపరమైన గ్యారంటీ లేదు. వారేం చేయాలి. వారికి ఏమవుతుంది? దిల్లీ సరిహద్దులలో సంవత్సరంపైగా సాగిన రైతాంగ పోరాటమే రహదారి. అదే స్ఫూర్తితో మరింత శక్తిమంతంగా సాగించే రైతాంగ పోరాటాలే వ్యవసాయ సమస్యలన్నిటికీ పరిష్కారం.

డాక్టర్ కొల్లా రాజమోహన్, నల్లమడ రైతుసంఘం

భారత్ రంగ్ మహోత్సవ్ 2023

ప్రపంచ స్థాయి నాటకరంగ ప్రదర్శనల్లో భాగంగా ఫిబ్రవరి 19-23 వరకు రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా(ఎన్ఎస్‌డీ) 22వ భారత్‌రంగ్ మహోత్సవ్ 2023(థియేటర్ ఫెస్టివల్) చేపట్టింది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో బ్రిటీష్ వారిని గడగడలాడించిన ఘనత తెలుగు నాటకరంగానికి దక్కుతుంది. తెల్లవారి నిషేధాజ్ఞలకు వెరవకుండా తెలుగు రచయితలు చాలా నాటకాలను రాశారు. తెలుగు రంగస్థలాన్ని వృద్ధిలోకి తీసుకురావడానికి రాజమహేంద్రవరంలో ఎన్ఎస్‌డీ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఎన్ఎస్‌డీని 1959లో న్యూదిల్లీలో భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. ఎన్ఎస్‌డీ భారతీయ నాటకరంగానికి, ప్రపంచ నాటకరంగానికి గణనీయంగా దోహదపడింది. ఎన్ఎస్‌డీ పూర్వ విద్యార్థులలో నసీరుద్దీన్ షా, ఓం పురి, అనుపమ్ ఖేర్, ఇర్ఫాన్ ఖాన్, నవాజుద్దీన్ సిద్ధి వంటి ప్రముఖ భారతీయ చలనచిత్ర నటులు ఉన్నారు. తెలుగు నాటకరంగం దాదాపు క్రీస్తుపూర్వం 2వ శతాబ్దం నుండి మూలాలను కలిగి ఉంది. సినిమారంగంపై ఆదరణ పెరగడంతో చాలా మంది దర్శకులు, నటులు, రచయితలు, సాంకేతిక నిపుణులు చిత్ర పరిశ్రమకు వలస రావడంతో నాటకరంగంలో ఆవిష్కరణలు తగ్గాయి. జాతీయ నాటకరంగంతో పోలిస్తే పేలవమైన పనితీరు ప్రమాణాలు, నూతన ఆవిష్కరణలు లోపించడంతో ఆంధ్రప్రదేశ్ లోని నాటకరంగం అంతరించే దశలో ఉంది. 15వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో శ్రీనాథుడు రచించిన సంస్కృత నాటకం ప్రేమాభిరామం" ను అనుకరిస్తూ తొలి తెలుగు అనువాద నాటకం 'క్రీడాభిరామం' ను వెలువరించారు. 19వ శతాబ్దంలో, ఆధునిక నాటక రచనకు ఆద్యులైన కోరాడ రామచంద్ర శాస్త్రి 1860లో తొలి తెలుగు స్వతంత్ర నాటకం 'మంజరీ మధుకరీయం'ను 1903లో ముద్రించారు. నాటక రంగంలో "సురభి" ప్రత్యేకతను సంతరించుకుంది. గ్రామాల్లో నాటకాలు వేస్తూ సంచారజీవనం సాగిస్తున్న కుటుంబ సమూహాల అరుదైన సంస్థలు సురభి నాటక సంస్థలు. మహిళలను తొలిసారిగా వేదికపైకి తీసుకొచ్చి, టికెట్ విధానాన్ని ప్రవేశపెట్టింది. జిమ్మిక్కులు, ట్రిక్ సన్నివేశాలు నాటకంలో ప్రవేశపెట్టింది ఈ సురభి బృందాలే. 1885 నుండి నేటికి దేశ విదేశాల్లో ప్రదర్శనలు ఇస్తూనే ఉన్నారు. 1897వ సంవత్సరంలో "కన్యాశుల్కం" నాటకం రంగస్థలం మీదకు వచ్చింది. గురజాడ అప్పారావు రచించిన ఈ నాటకం నాటక రంగ చరిత్రనే ఓ మలుపు తిప్పింది.

నిత్య జీవితంలో సామాన్య ప్రజానీకం ఎదుర్కొనే సమస్యలపై జనబాహుళ్యానికి అవగాహన కల్పించే ఆశయంతో ప్రజానాట్యమండలి స్థాపించారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బావుటా ఎగురవేసిన ప్రజానాట్యమండలి 1943లో స్థాపించడమైంది. ఇప్పటికీ వీధి నాటకాలతో తన సందేశాన్ని వినిపిస్తూనే ఉంది. భారత ప్రజానాట్యమండలి(ఇప్టా) వ్యవస్థాపక కార్యదర్శిగా గరికపాటి రాజారావు తదితరులు పనిచేశారు. 120 సంవత్సరాల తెలుగు నాటక చరిత్రలో ఉహాలోకంలో విహరిస్తున్న నాటకాన్ని భూమార్గం పట్టించి ఒక మలుపు తిప్పింది ప్రజా నాట్య మండలి. "నటన" నే వృత్తిగా తీసుకొని ప్రత్యేకంగా సాంఘిక నాటకాలు ప్రదర్శించటం ప్రారంభించాయి. ఏ ఊళ్ళో నాటక ప్రదర్శనలు జరిగినా చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి జనాలు బళ్ళు కట్టుకుని మరీవెళ్ళి వాటిని చూసొచ్చేవారు. ప్రేక్షకుల నుంచి లభిస్తున్న స్పందనతో సామాజిక పరిస్థితుల్ని, సంఘటనల్ని తీసుకుని పుంఖాను పుంఖంగా నాటకాలు రచించారు. ముఖ్యంగా "గరికపాటి" దర్శకత్వంలో ప్రదర్శించిన "మా భూమి, ముందడుగు, ఇనుప తెరలు", గొల్లపూడి "రాగ రాగిణీ, కళ్ళు", బెల్లంకొండ రామదాసు "పునర్జన్మ", పినిశెట్టి గారి "పల్లెపడుచులు", ఉన్నవ "మాలపల్లి", ఎన్నార్ నంది "మరో మొహంజోదారో" ఇలా ఎన్నో ఎన్నెన్నో 1950 నించి 1960 వరకు ఎన్నోచోట్ల ఎన్నెన్నో సార్లు ప్రదర్శించారు. ప్రజల్లో పోరాటస్ఫూర్తిని నింపాయి. తరువాత కాలంలో నాటకాలు టికెట్టు పెట్టుకొని హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో రోజు రెండు ప్రదర్శనలతో అనేక ప్రదర్శనలు ప్రదర్శించిన చరిత్ర, టికెట్లు దొరకని వారు అర్థరాత్రి గొడవచేసి మరో "షో" వేయించుకున్న సందర్భాలచరిత్ర ప్రజానాట్య మండలికి ఉంది.

1880లో మహారాష్ట్రకు చెందిన "ధార్వాడ నాటక సమాజం" మన రాష్ట్రానికి వచ్చి హిందీ నాటకాల్ని గోదావరి, కృష్ణా జిల్లాలలో ప్రదర్శించారు. వీరు రాజమండ్రి శ్రీ విజయనగరం మహారాజా బాలికా పాఠశాలలో నాటకాల్ని ప్రదర్శించారు. అలా వీరు తెలుగు నాటకకారులలో ప్రేరణ కలిగించారు. ధార్వాడ వారి నాటకాలతో స్ఫూర్తిపొందిన కందుకూరి వీరేశలింగం పంతులు ధార్వాడప్రదర్శించిన వేదికపైనే తొలిసారిగా వ్యవహారిక భాషలో రాసిన 'వ్యవహార ధర్మబోధిని' నాటకాన్ని ప్రదర్శించారు. వేదం వెంకటరాయ శాస్త్రి చారిత్రాత్మక నాటకం "ప్రతాప రుద్రీయం" కూడా బహుళా ప్రేక్షకాదరణ పొందటంతో చాలామంది కవులు తమ దృష్టిని నాటక రచనవైపు సారించారు. చిలుకమర్తి, పానుగంటి, కాళ్ళకూరి, శ్రీపాద, బలిజేపల్లి వంటి ప్రముఖ కవులు "కావ్యేషు నాటకం రమ్యం" అంటూ నాటక రచనకు మూడు దశాబ్దాల పాటు చారిత్రక, సామాజిక, పౌరాణిక, గద్య పద్య, గేయాత్మక నాటక ప్రదర్శనలు ఆంధ్ర దేశమంతా కొనసాగాయి. 1960 తర్వాత తెలుగు నాటకం మరింత ఆధునికతను సంతరించుకుంది.

నాటక రంగాన్ని, ఒక మహానటుడ్ని ఆంధ్రలోకం ఎలా నిరాదరిస్తుందో రంగస్థలంపై ఆవిష్కరించిన భమిడిపాటి వారి 'కీర్తిశేషులు' వంటి నాటకం వచ్చిన కాలమది. ఈ కాలంలోనే గొల్లపూడి మారుతీరావు, దాసం గోపాలకృష్ణ, ఆర్.వి.యస్.రామస్వామి, మోదుకూరి జాన్సన్, గన్నిశెట్టి వెంకటేశ్వరరావు, భీశెట్టి లక్ష్మణరావులాంటి రచయితలు వారి కలాల్ని సంధించారు.1980 తర్వాత కూడా నాటికల జోరు కొనసాగుతూనే ఉంది. 20వ శతాబ్దం చివరలో అంటే 1998 సంవత్సరంలో ప్రభుత్వం నంది నాటకపోటీలు ప్రారంభించింది. ప్రతీ సంవత్సరం కొత్త సాంఘిక నాటకం రావాలనే నిబంధన నాటకాల జీవితాన్ని ఒక సంవత్సరానికే కుదించేసి, కొన్ని సందర్భాల్లో ఒక్క ప్రదర్శనకే తగ్గించేసి సాంఘిక నాటకం నడుము విరిగినట్టు చేస్తున్నది. ఈ నిబంధన పౌరాణిక నాటకాలకు లేని కారణంగా నంది నాటకాల్లో పౌరాణిక నాటక ప్రమాణాలు పెరుగుతువచ్చాయి.

ఆర్.మల్లికార్జునరావు, 9491659899
భాషా సాంస్కృతికశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

కాంగ్రెస్ నేత పవన్ ఖేడా అరెస్టు

- విమానం నుంచి దింపిన పోలీసులు
- దిల్లీ విమానాశ్రయంలో ఉద్రిక్తత
- భయంతో ప్లీనరీకి బీజేపీ ఆటంకం: కాంగ్రెస్

గువహతి/న్యూదిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పవన్ ఖేడాను అసోం పోలీసులు గురువారం దిల్లీ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. దీంతో దేశ రాజధాని దిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. రాయ్‌పూర్‌లో జరిగే కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలకు హాజరయ్యేందుకు బయల్దేరిన పవన్ ఖేడాను విమానాశ్రయంలో అసోం పోలీసులు అడ్డుకున్నారు. ఆయనను బలవంతంగా విమానం నుంచి దించారు. ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకంగా అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణపై పవన్ ఖేడాను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పవన్ ఖేడా అరెస్టుపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. ప్లీనరీకి ఆటంకాలు కలిగించేందుకే మోదీ సర్కారు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని విమర్శించింది. బీజేపీ నిరాశా నిస్పృహతో కొట్టుమిట్టాడుతోందని వ్యాఖ్యానించింది. అసోం పోలీసుల అభ్యర్థన మేరకు పవన్‌ను దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు దిల్లీ సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. అసోం పోలీసులకు తాము తోడ్పాటు మాత్రమే అందించామని, పవన్‌ను ఆ రాష్ట్ర పోలీసులే అరెస్టు చేశారని వివరించారు. మోదీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినందుకుగాను ఖేడాపై అనేక సెక్షన్ల కింద అసోంలోని హఫ్లాంగ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మోదీ, ఇతర అంశాలపై ఖేడా చేసిన వ్యాఖ్యలకు సంబంధించి శామ్యూల్ చాంగ్‌సన్ ఫిర్యాదు మేరకు హఫ్లాంగ్ పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైనట్లు దిమా హసావో ఎస్పీ మయాంక్ కుమార్ పీటీఐకి చెప్పారు. ప్రధానిపై ఖేడా వ్యాఖ్యలు ఎఫ్ఐఆర్‌లో ఓ భాగం మాత్రమేనని, ఇతర ఫిర్యాదులు కూడా ఆయనపై ఉన్నాయని, అందుకే అనేక సెక్షన్ల కింద ఖేడాపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో శుక్రవారం నుంచి ఏఐసీసీ ప్లీనరీ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు హాజరయ్యేందుకు పవన్ ఖేడా సహా అనేకమంది కాంగ్రెస్ నేతలు ఈ ఉదయం దిల్లీ నుంచి బయల్దేరారు. దిల్లీ విమానాశ్రయంలో అందరూ ఇండిగో విమానం ఎక్కారు. అయితే టేకాఫ్‌కు కొద్ది నిమిషాల ముందు లగేజీ విషయంలో ఏదో సమస్య ఉందని, విమానం దిగాలని పవన్ ఖేడాను సిబ్బంది కోరారు. 'మిమ్మల్ని పోలీసులు కలుస్తార'ని విమాన సిబ్బంది చెప్పారు. ఈ విషయం తెలియగానే కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు విమానం దిగి ఆందోళన చేపట్టారు. ఈ పరిణామాలతో దిల్లీ విమానాశ్రయంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 'నేను ఒకే ఒక్క బ్యాగేజీ తెచ్చుకున్నా. అయినా నన్ను విమానంలోకి అనుమతించలేమని చెప్పారు. పోలీసులు వచ్చి కలుస్తారని అన్నారు' అని విమానం దిగిన తర్వాత పవన్ ఖేడా తెలిపారు. గందరగోళ పరిస్థితుల అనంతరం పవన్ ఖేడాను అసోం పోలీసులు అరెస్టు చేసినట్లు కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. అనంతరం ఆయనను గువహతికి తరలించారు. మోదీపై అవమానకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ అసోంలో పవన్ ఖేడాపై బీజేపీ నేత ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. అరెస్టును కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. ఎలాంటి అరెస్టు వారెంట్ లేకుండానే పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారని ఆ పార్టీ నేతలు మండిపడ్డారు. 'మోదీ ప్రభుత్వం గూండా తరహాలో వ్యవహరిస్తోంది. ఏఐసీసీ ప్లీనరీకి వెళ్లకుండా పవన్‌ఖేడాను అడ్డుకున్నారు. ఆయన గొంతును అణగదొక్కేందుకు సినీ ఫక్కీలో ఎఫ్ఐఆర్ డ్రామా ఆడారు. ఇది సిగ్గుచేటు' అని పార్టీ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ట్విటర్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, ఈ పరిణామాలపై ఇండిగో కూడా స్పందించింది. 'దిల్లీ నుంచి రాయ్‌పూర్ వెళ్లాల్సిన విమానంలో ఓ ప్రయాణికుడిని సిబ్బంది దించేశారు. మిగతా ప్రయాణికుల్లో కొంతమంది తమ ఇష్టపూర్వకంగా దిగిపోయారు. మేం అధికారుల ఆదేశాల ప్రకారమే నడుచుకున్నాం. ఈ పరిణామాల కారణంగా విమానం ఆలస్యమైంది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం" అని ఎయిర్‌లైన్ వెల్లడించింది.

బీజేపీ నిస్పృహతోనే... గెహ్లాత్

పవన్ ఖేడా అరెస్టుపై రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాత్ తీవ్రంగా మండిపడ్డారు. బీజేపీ నిరాశా నిస్పృహ ఈ చర్యతో బహిర్గతమైందని విమర్శించారు. రాయ్‌పూర్ వెళుతున్న ఖేడాను పోలీసులు అరెస్టు చేశారని, అసోం పోలీసులు దిల్లీ వెళ్లి ఖేడాను ఇంత అత్యవసరంగా అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. రాయ్‌పూర్‌లో ఇప్పటికే కాంగ్రెస్ నేతల ఇళ్లపై ఈడీ దాడులు జరిగాయని, ఇప్పుడు ఏకంగా నేతల అరెస్టుకు దిగారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు గెహ్లాత్ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బాఘెల్ స్పందిస్తూ కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలకు ఆటంకం కలిగించేందుకు మోదీ సర్కారు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్లీనరీ విజయవంతం కావడం బీజేపీకి ఇష్టం లేదని, తమ పార్టీ నాయకుల ఇళ్లపై ఈడీ దాడులు కూడా జరిగాయని మండిపడ్డారు. కాంగ్రెస్ సమావేశాల గురించి బీజేపీ భయపడుతోందన్నారు. ఖేడా తమ పార్టీ అధికార ప్రతినిధి అని, ప్రముఖ నాయకుడని చెప్పారు. ఆయన నేరస్తుడేమీ కాదని వ్యాఖ్యానించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ప్లీనరీని అడ్డుకోవాలని బీజేపీ భావిస్తోందని బాఘెల్ అన్నారు.

ఖేడాకు తాత్కాలిక బెయిల్

న్యూదిల్లీ: కాంగ్రెస్ నేత పవన్ ఖేడాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణపై అసోం పోలీసులు అరెస్టు చేసిన ఖేడాకు సుప్రీంకోర్టు ఫిబ్రవరి 28వ తేదీ వరకు తాత్కాలిక మెయిల్ మంజూరు చేసింది. తక్షణమే పవన్ ఖేడాను విడుదల చేయాలని ఆదేశించింది. దిల్లీలోని సంబంధిత మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచిన తర్వాత తాత్కాలిక బెయిల్‌పై ఖేడాను విడుదల చేయాలని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టంచేసింది. తమ ఆదేశాలు మంగళవారం వరకు అమలులో ఉంటాయని తెలిపింది. కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 27కు వాయిదా వేసింది. మోదీపై వ్యాఖ్యలకు సంబంధించి ఖేడాకు వ్యతిరేకంగా అసోం, లక్నో, వారణాసి వంటి అనేక ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ కేసులన్నింటినీ కలపాలన్న పవన్ ఖేడా అభ్యర్థనపై అసోం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలకు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఖేడా తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపిస్తూ అదేరోజు ప్రధాని మోదీకి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేత పవన్ ఖేడా క్షమాపణ చెప్పారని, ఈ ఎఫ్ఐఆర్ ప్రకారం ఖేడాను అరెస్టు చేయాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ఖేడా ప్రయోగించిన పదజాలానికి, పోలీసులు నమోదు చేసిన సెక్షన్లకు సంబంధమే లేదని చెప్పారు.

ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా హరిచందన్ ప్రమాణం

రాయ్‌పూర్: ఉత్తరాఖండ్ గవర్నర్‌గా విశ్వభూషణ్ హరిచందన్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌లోని రాజ్‌భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ 9వ గవర్నర్‌గా విశ్వభూషణ్ హరిచందన్ చేత ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అరుప్ కుమార్ గోస్వామి ప్రమాణం చేయించారు. గవర్నర్ హరిచందన్ హిందీలో ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి భూపేష్ భగేల్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి రవీంద్ర చౌబే, ఛత్తీస్‌గఢ్ బీజేపీ అధ్యక్షుడు అరుణ్ సావో, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రమణ్ సింగ్, రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత నారాయణ్ చందేల్‌తో పాటు అనేకమంది సీనియర్ అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు విశ్వభూషణ్ హరిచందన్ 24 జులై 2019 నుంచి 22 ఫిబ్రవరి 2023 వరకు ఆంధ్రప్రదేశ్ 23వ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

'చార్‌ధామ్'కు పెరగనున్న యాత్రికులు

డెహ్రాడూన్: ఈ సీజన్‌లో ఉత్తరాఖండ్‌లోని చార్ ధామ్ యాత్ర (బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి సందర్శన)కు రికార్డు స్థాయిలో యాత్రికులు వచ్చే అవకాశం ఉందని, వారిలో 60వేల మందికి పైగా గత రెండు రోజులుగా బద్రీనాథ్ , కేదార్‌నాథ్ యాత్రకు ఇప్పటికే నమోదు చేసుకున్నారని అధికారులు గురువారం తెలిపారు. రెండు హిమాలయ దేవాలయాల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ మంగళవారం ప్రారంభం కాగా గంగోత్రి, యమునోత్రికి రిజిస్ట్రేషన్ కోసం నమోదు తేదీలను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. గత రెండు రోజులుగా, మొత్తం 61,250 మంది యాత్రికులు ఏప్రిల్ 27, ఏప్రిల్ 25 న తెరవబడే బద్రీనాథ్, కేదార్‌నాథ్ సందర్శన కోసం నమోదు చేసుకున్నారని పర్యాటక శాఖ డిప్యూటీ డైరెక్టర్ యోగేంద్ర గంగ్వార్ పేర్కొన్నారు. గత ఏడాది రికార్డు స్థాయిలో 47 లక్షల మంది యాత్రికులు చార్‌ధామ్ ఆలయాలను సందర్శించారని, ఈ ఏడాది వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ చైర్మన్ అజేంద్ర అజయ్ వెల్లడించారు. జోషిమఠ్‌లో భూమి క్షీణత సమస్య కారణంగా యాత్రీకుల సంఖ్య తగ్గుతుందా అన్న ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... యాత్ర సురక్షితంగా, సాఫీగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు తీసుకుందని చెప్పారు. 'కొండల్లో భూమి కుంగడం, కొండచరియలు విరిగిపడటం సాధారణ సమస్యలు... అవి వచ్చినప్పుడు పరిష్కరించబడతాయి. కొందరు అనవసరంగా భయాందోళనలు సృష్టిస్తున్నారు' అని అజయ్ అన్నారు. వార్షిక యాత్ర కోసం తొలిసారిగా క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. యాత్రికుల మొబైల్ ఫోన్‌లో నమోదు చేసుకున్న తర్వాత వారి ఫోన్‌లో క్యూఆర్ కోడ్ పంపబడుతుంది, దాని ఆధారంగా వారు ఆలయాలను సందర్శించడానికి టోకెన్‌లను పొందుతారని వివరించారు.

'నాగాశాంతి'పై బీజేపీ నయవంచన

దీనికి పరిష్కారమే కాంగ్రెస్ కోరేది: శశిథరూర్

కొహిమా: నాగా శాంతి అంశం చాలా కాలంగా అపరిష్కృతంగా ఉందని, దీనిపై బీజేపీ ప్రభుత్వం నాగాలాండ్ ప్రజలను మోసం చేసిందని, ఇది పరిష్కారం కావాలని తమ పార్టీ కోరకుంటోందని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. కాంగ్రెస్ భవన్ వద్ద ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ నాగాలాండ్ కనీస అవసరాలకు నోచుకోవడం లేదన్నారు. రాష్ట్ర హోదా సాధించి 60 ఏళ్లు అయినా నీరు, విద్యుత్, ఆరోగ్యం, రోడ్లు వంటి మౌలిక వసతులు లేవని చెప్పారు. ఈశాన్య రాష్ట్రంలో అభివృద్ధి, పురోగతికి కాంగ్రెస్ ఆశాకిరణమన్నారు. బీజేపీ మోసాలు, అవినీతి, అసమర్థకు నాగాలు బలవుతున్నారని వ్యాఖ్యానించారు.'నాగా ఒప్పందాన్ని సాధించినట్లు మోదీ ప్రభుత్వం 2015లో ప్రకటించిందిగానీ అది కార్యాచరణ ఒప్పందం మాత్రమే అని తర్వాత చెప్పింది. ఇప్పుడేమో చర్చలు కొనసాగుతున్నట్ల చెబుతోంది' అని థరూర్ అన్నారు. 'ఈ వ్యవహారం మూడు నెలల్లో పరిష్కారమైనట్లు 2019లో నాగాలాండ్ గవర్నర్, నాగా శాంతి చర్చలకు కేంద్రం తరపు మధ్యవర్తి ఆర్ఎన్ రవి ప్రకటించారు. ఇది జరిగి నాలుగేళ్లు అయింది. ఈశాన్య రాష్ట్ర ప్రజలను బీజేపీ మోసం చేసింది. కనీస అవసరాలనూ కల్పించలేదు. శుభ్రమైన తాగునీరు, ఆరోగ్య వసతులు, విద్య, రోడ్లు వంటి వసతుల్లేవు. ఇవి మానవాళి కనీస అవసరాలు. వాటి కల్పనలో కేంద్రం ఘోరంగా విఫలమైంది' అని థరూర్ విమర్శించారు. 'ఒక దేశం, ఒక మతం, ఒక భాష, ఒక సంస్కృతి-సంప్రదాయం, ఒక నాయకుడు' దిశగా బీజేపీ అడుగులు వేస్తోందని, దీనిని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

మతపరమైన మైనారిటీలపై దాడులు జరుగుతుంటే నాగాలాండ్ ప్రభుత్వం ఎందుకని మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. నాగాలాండ్ అసెంబ్లీలో 60 మంది సభ్యులు ఉంటే 23 స్థానాల్లో పోటీ చేసి ప్రభుత్వాన్ని ఏ విధంగా కాంగ్రెస్ ఏర్పాటు చేయగలదనే అంశంలో థరూర్ స్పష్టతిచ్చారు. ఇది కూటముల శకమని ఆయన చెప్పారు. తమ పార్టీ సరిపడ స్థానాల్లో గెలిస్తే... రాష్ట్రంలో మార్పు తెచ్చేలా భావసారూప్యతగల పార్టీలతో కలిసి ముందుకెళతామన్నారు. అసెంబ్లీలో ప్రస్తుతం ఒక్క ఎమ్మెల్యే లేరుగానీ అభివృద్ధికి, దీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న నాగాలాండ్ సమస్యలకు కాంగ్రెస్‌తోనే సమాధానం సాధ్యమని థరూర్ నొక్కిచెప్పారు. నాగాలాండ్ అసెంబ్లీకి ఈనెల 27న ఎన్నికలు జరుగుతాయి. ఓట్లను మార్చి 2వ తేదీన లెక్కిస్తారు.

రాహుల్ నాయకత్వంలోనే ప్రభుత్వం

కాంగ్రెస్ నేత షకీల్ అహ్మద్

న్యూదిల్లీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలు అధికారం సాధిస్తే ప్రధానిగా రాహుల్‌గాంధీ ఆ కూటమికి నేతృత్వం వహిస్తారని కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీమంత్రి షకీల్ అహ్మద్ చెప్పారు. సాంకేతికంగా చాలా పార్టీలు ఉన్నప్పటికీ ప్రధానంగా రెండు ప్రధాన జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీయేనని అహ్మద్ అన్నారు. మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌లో అధికారంలో ఉందని, ఏడు రాష్ట్రాల్లో తాము సంకీర్ణ ప్రభుత్వంలో పాలుపంచుకున్నామని, 10 రాష్ట్రాల్లో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నామని బీహార్‌కు చెందిన సీనియర్ నేత అహ్మద్ వివరించారు. ప్రధానమంత్రి అభ్యర్థిగా రాహుల్‌గాంధీ ఉండాలని, ఆయన ప్రధాని కావాలని, దేశానికి నాయకత్వం వహించాలని ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త కోరుకుంటున్నట్లు తెలిపారు. అహ్మద్ గురువారం విమానాశ్రయంలో పీటీఐతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే...ఆ పార్టీ నాయకులు ప్రధాని అవుతారని, అలాగే ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే దానికి రాహుల్‌గాంధీ నాయకత్వం వహించాలని, రాహుల్‌ను ప్రధానిని చేయాల్సిందేనని అహ్మద్ అన్నారు. కాంగ్రెస్ మాదిరిగానే దేశం కూడా ఇదే కోరుకుంటున్నదని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు ఏడాది సమయం ఉన్నప్పటికీ ప్రతిపక్షాల ఐక్యత కోసం ప్రయత్నాలు జరుగుతున్న వేళ అహ్మద్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 2024 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని పార్టీ అధినేత మల్లికార్జున ఖర్గే కూడా ఎన్నికల ప్రచారంలో స్పష్టంచేశారు.

మద్యం కుంభకోణం...

కేజ్రీవాల్ పీఏను ప్రశ్నించిన ఈడీ

న్యూదిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన దిల్లీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పీఏ బిభవ్ కుమార్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గురువారం ప్రశ్నించింది. ఇప్పటి వరకు ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఈ కేసులో దర్యాప్తు ఎదుర్కొంటుండగా.. తాజాగా ఈ సెగ ముఖ్యమంత్రిని తాకింది. దిల్లీ మద్యం కేసులో సిసోడియా హస్తం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కుంభకోణంపై చేపట్టిన విచారణల్లో భాగంగా ఇప్పటికే చాలామందిని అరెస్టు చేసిన విషయం విదితమే. ఈడీ, సీబీఐ వేర్వేరుగా విచారణలు జరుపుతున్నాయి. సిసోడియా సన్నిహితుడు విజయ్ నాయర్, అభిషేక్ బోయినపల్లి, శరత్ చంద్రారెడ్డి, బినోయ్ బాబు, సమీర్ మహేంద్రు సహా ఏడుగురిని నిందితులుగా పేర్కొంటూ ఇప్పటికే సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. తాజాగా మరోసారి సిసోడియాకు సమన్లు ఇచ్చింది. వచ్చే ఆదివారం ఆయన అధికారుల ఎదుట విచారణకు హాజరుకావాల్సి ఉంది. ఇప్పుడు ఈ కేసులో కేజ్రీవాల్ పీఏను ఈడీ ప్రశ్నించింది. మద్యం కుంభకోణం కేసుకి సంబంధించి చార్జ్‌షీట్‌లో కేజ్రీవాల్ పేరును ఈడీ ప్రస్తావించింది. తాజాగా ఆయన వ్యక్తిగత కార్యదర్శిని విచారించడం చర్చనీయాంశంగా మారింది. కాగా, సౌత్ గ్రూపు నుంచి రూ.100 కోట్లు తీసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయ్‌నాయర్ తన మనిషి అని, విజయ్‌ను నమ్మొచ్చని ఫేస్‌టైం కాల్‌లో సమీర్ మహేంద్రుతో కేజ్రీవాల్ అన్నారని పేర్కొంది. కేజ్రీవాల్‌ను ఎవరెవరు కలిసిందీ, ఎవరెవరు ఫోన్‌లో మాట్లాడిందీ తెలిపింది. స్కామ్‌లో కీలక వ్యక్తులతో పాటు ఆయా సంస్థల్లో పనిచేస్తున్న వారి వాంగ్మూలాలను చార్జిషీట్‌కు ఈడీ జత చేసింది. కవిత తరపు ప్రతినిధిగా అరుణ్‌పిళ్లై ఇండో స్పిరిట్స్‌లో చేరారని తెలిపింది. సౌత్ గ్రూపునకు చెందిన కవిత, మాగుంట, అభిషేక్ బోయినపల్లి, శరత్‌చంద్రారెడ్డి ఎవరెవరితో మాట్లాడారు? ఎవరెవరితో ఎక్కడ సమావేశమయ్యారన్న అంశాలు పొందుపరిచింది. ముడుపుల రూపంలో ముందుగా పెట్టుబడి ఎలా తిరిగి రాబట్టాలనే అంశాన్ని పెట్టుబడిదారులు చర్చించారని పేర్కొంది. విజయ్‌నాయర్ పాలసీ రూపకల్పనలో కీలకపాత్ర పోషించాడని పేర్కొంది. మనీలాండరింగ్ కేసు పెట్టడానికి తగిన కారణాలున్నాయని తెలిపింది. సౌత్ గ్రూపు నుంచి ఆప్ నేతలకు సొమ్ములు ఎలా చేరాయో వివరించింది. ఎవరెవరిని ఏయే కారణాలతో అరెస్టు చేసిందీ తెలియజేసింది. సౌత్‌గ్రూపు నుంచి తీసుకున్న రూ.100 కోట్లలో రూ.30 కోట్లు గోవా ఎన్నికలకు ఆప్ ఖర్చు చేసినట్లు ఆరోపించింది.

రేపటి నుంచి 'న్యూదిల్లీ వరల్డ్ బుక్ ఫెయిర్'



న్యూదిల్లీ: ప్రపంచ పుస్తక మహోత్సవం (న్యూదిల్లీ వరల్డ్ బుక్ ఫెయిర్) ఫిబ్రవరి 25వ తేదీనుంచి న్యూదిల్లీలో ప్రారంభం కానుంది. మూడేళ్ల విరామం తర్వాత 30కి పైగా దేశాలు, దాదాపు 1,000 మంది ప్రచురణకర్తలు, ప్రదర్శనకారుల భాగస్వామ్యంతో ఈ బుక్ ఫెయిర్ పూర్తి స్థాయిలో తిరిగి వస్తున్నట్లు నేషనల్ బుక్ ట్రస్ట్ (ఎన్‌బీటీ) గురువారం ప్రకటించింది. ఈ ఏడాది పుస్తకాల పండుగను విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఫ్రెంచ్ రాయబారి ఇమ్మాన్యుయేల్ లెనైన్, ఎన్‌బీటీ చైర్మన్ గోవింద్ ప్రసాద్ శర్మ తదితరులు ప్రారంభించనున్నారు. ఈ బుక్ ఫెయిర్ చివరి సారిగా జనవరి 2020లో జరిగింది. ఆపై కరోనా మహమ్మారి కారణంగా ఆన్‌లైన్‌లో నిర్వహించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' థీమ్ ఆధారంగా, నోబెల్ బహుమతి గ్రహీత అన్నీ ఎర్నాక్స్‌తో సహా 16 మంది ఫ్రెంచ్ రచయితలు, 60 మందికి పైగా ప్రచురణకర్తలు, సాహిత్య ఏజెంట్లు, సాంస్కృతిక ప్రతినిధుల భాగస్వామ్యంతో అతిథి దేశంగా ఫ్రాన్స్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫ్రాన్స్ రాయబార కార్యాలయం సాంస్కృతిక సలహాదారు ఇమ్మాన్యుయేల్ లెబ్రూన్-డామియన్స్ ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... 'ఈ రోజు ఫ్రెంచ్ ప్రజలు భారతీయ సాహిత్యంపై ఎక్కువ ఆసక్తి చూపడం మనం చూస్తున్నాం. ఫ్రాన్స్, భారతదేశం సాహిత్యంలో రెండు పెద్ద దేశాలు. ఫ్రాన్స్ నుంచి వచ్చిన రచయితల ప్రతినిధి బృందానికి సాహిత్యంలో నోబెల్ బహుమతి అందుకున్న అన్నీ ఎర్నాక్స్ నాయకత్వం వహిస్తున్నారు. ఇతర రచయితలలో స్త్రీవాద రచయిత్రి కామిల్లె లారెన్స్, పిల్లల రచయిత సూసీ మోర్గెన్‌స్టెన్, గ్రాఫిక్ నవలా రచయిత సైమన్ లామౌరెట్ కూడా ఉంటారు' అని ఆయన తెలిపారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకుని పుస్తక ప్రదర్శనలో అనేక సాహిత్య మరియు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎన్‌బిటి డైరెక్టర్ యువరాజ్ మాలిక్ తెలిపారు.

మేఘాలయ ప్రభుత్వ అవినీతికి బీజేపీ ప్రోత్సాహం

కాంగ్రెస్ విమర్శ

షిల్లాంగ్: మేఘాలయ ప్రభుత్వ అవినీతికి బీజేపీ అండగా నిలిచిందని కాంగ్రెస్ విమర్శించింది. మేఘాలయ ప్రభుత్వం దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన ఆరోపణలను సమర్థించింది. అయితే, ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీ సైతం అవినీతిని పెంచి పోషించిందని మండిపడింది. బీజేపీ సహా ఇంతకుముందు భాగస్వాములుగా ఉన్న పార్టీలు సైతం పాలక ఎన్‌పీపీ ప్రభుత్వ అవినీతిని ఎండగడుతున్నాయి. మరోవైపు ప్రతిపక్ష కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ విమర్శల దాడి చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ మేఘాలయ రాష్ట్ర అధ్యక్షుడు విన్సెంట్ పాలా గురువారం పీటీఐకి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. అవినీతికి సంబంధించి ఎన్‌పీపీ ప్రభుత్వంపై అమిత్‌షా చేసిన ఆరోపణలు సరైనవేనని విన్సెంట్ పాలా చెప్పారు. ఈ అవినీతిని బీజేపీ ప్రోత్సహించిందని ఆరోపించారు. ప్రారంభంలో ఎన్‌పీపీ ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామిగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఎన్‌పీపీతో బీజేపీ పొత్తును తెంచుకున్నామని, రాష్ట్రంలోని మొత్తం 60 సీట్లలో తమ పార్టీ పోటీ చేస్తుందని, బలమైనశక్తిగా ఎదుగుతామని ఎన్నికల ర్యాలీల్లో అమిత్‌షా చెప్పుకొచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని పాలా దీమా వ్యక్తంచేశారు. ఫిబవరి 27న జరిగే ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ మొత్తం 60 స్థానాల్లో పోటీ చేస్తోందని చెప్పారు. చాలామంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నుంచి ఫిరాయించారని, ఇప్పుడు కొత్త రక్తంతో తాము ఎన్నికల బరిలో నిలిచామని, అభ్యర్థులంతా మంచి మనసు, ఆలోచనలు, ఆశాభావంతో ఉన్నారని, యువత సంపూర్ణ మద్దతిస్తోందని చెప్పారు. దీని కాంగ్రెస్ ప్రచారం దూసుకెళుతోందని, ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని తెలిపారు. గత ఎన్నికల నాటితో పోలిస్తే ఇప్పుడు ప్రభుత్వ వ్యతిరేకత బాగా పెరిగిందన్నారు. అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గుతున్నారని చెప్పారు. అన్ని ఇబ్బందులు అధిగమించామని, ఇప్పుడు ఎన్నికల్లో పోరాడే పరిస్థితికి చేరుకున్నామని పాలా వివరించారు. 60 మంది అభ్యర్థులను పోటీలో దించగా 44 మంది కొత్త ముఖాలేనన్నారు.అత్యధికమంది అభ్యర్థులు విద్యావేత్తలని, సాధ్యమైనంత వరకు మహిళలకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించామన్నారు. మహిళా ఓటర్లు సైతం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని పాలా చెప్పారు. కుటుంబ వ్యవహారాలు, పేదరికం కారణంగా మహిళలు పెద్దగా రాజకీయాల పట్ల ఆసక్తి చూపడం లేదని పేర్కొన్నారు.

ఇక ఎన్నికల్లో పోటీచేయను

కాంగ్రెస్ సీనియర్ నేత సురేశ్ రౌత్రాయ్



భువనేశ్వర్: ఇకమీదట ఎన్నికల్లో పోటీ చేయబోనని ఒడిశాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన సురేశ్ రౌత్రాయ్ (80) ప్రకటించారు. అయితే తన కుమారుడు మన్మత్ రౌత్రాయ్ ఒడిశాలోని జటాని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారని తెలిపారు. గురువారం ఇక్కడ విలేకరుల సమావేశంలో రౌత్రాయ్ మాట్లాడుతూ... 'నేను ఇకపై ఎన్నికల్లో పోటీ చేయను. అయితే, నా చిన్న కుమారుడు మన్మత్ రౌత్రాయ్ జటాని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టిక్కెట్‌పై పోటీ చేస్తారు' అని చెప్పారు. ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ... తాను గత 55 ఏళ్లుగా నిబద్ధతతో పనిచేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తనని, భవిష్యత్తులో పార్టీ మారే ఉద్దేశం లేదని రౌత్రే స్పష్టం చేశారు. 'నేను ఇప్పటికే పార్టీకి విధేయతను నిరూపించుకున్నాను. 55 సంవత్సరాలుగా సేవ చేశాను మరియు నా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని ఉపయోగించలేదు. పార్టీ కోసం నిజాయితీగా పనిచేస్తున్నందుకు నేను చాలా సంతృప్తిగా ఉన్నాను. నేను ఏ ఎన్నికల్లో పోటీ చేయనప్పటికీ అలాగే కొనసాగుతాను' అని ఆయన అన్నారు. బీజేడీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను కలిసిన కొద్ది రోజులకే రౌత్రే విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడంతో ఆయన కుమారుడు మన్మత్ ప్రాంతీయ పార్టీలో చేరే అవకాశం ఉందన్న ఊహాగానాలు వ్యాప్తి చెందాయి. అయితే, రౌత్రే ఈ ఊహాగానాలను తోసిపుచ్చారు. మరియు ఇది కేవలం మర్యాదపూర్వక సమావేశమని స్పష్టం చేశారు. 'నా కొడుకు విజయగాథను పంచుకునేందుకు సీఎంను కలిసేందుకు వెళ్లాను. నా కుమారుడు సాధించిన ఘనత తెలుసుకున్న సీఎం, 5టీ సెక్రటరీ (వీకే పాండియన్) ఇద్దరూ సంతోషం వ్యక్తం చేశారు' అని రౌత్రే విలేకరులతో అన్నారు. సిద్ధార్థ్ రౌత్రాయ్ గతేడాది ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో ఎలాంటి రాజకీయ చర్చలు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి హరేకృష్ణ మొహతాబ్‌ను తన రాజకీయ గురువుగా భావించే సురేశ్ రౌత్రాయ్... మాజీ ముఖ్యమంత్రి జేబీ పట్నాయక్ అనుచరుడిగా ఉన్నారు. జటాని నియోజకవర్గం నుంచి ఆయన ఆరుసార్లు ఒడిశా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1977లో జనతాపార్టీ టికెట్‌పై గెలిచారు. ఆ తర్వాత 1980, 1985, 1995, 2000, 2019లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు.

ఎన్నికలే ప్రధాన అజెండా

- నేడు రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ ప్లీనరీ
- బీజేపీ ఓటమి, పొత్తులపైనే దృష్టి



రాయ్‌పూర్: వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఏ విధంగా ముందుకెళ్లాలి, పార్టీని విజయపథంలో నడిపించే చర్యలు... ఎన్నికలకు ముందు-తర్వాత పొత్తులు-ప్రత్యామ్నాయ ఫ్రంట్ ఏర్పాటు వంటి అంశాలే కాంగ్రెస్ ప్లీనరీ అజెండాలో ప్రధానమైనవిగా ఉన్నాయి. రాయ్‌పూర్‌లో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు కాంగ్రెస్ 85 ప్లీనరీ జరగబోతోంది. 2024 లోక్‌సభ ఎన్నికలకు స్పష్టమైన కార్యాచరణ, బీజేపీని గద్దెదించే చర్యలపైనే ప్లీనరీ దృష్టిని కేంద్రీకరించింది. ప్లీనరీకి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహించనున్నారు. ఆయన నాయకత్వంలో కొత్త వర్కింగ్ కమిటీకి మార్గం సుగమం కాబోతోందని తెలుస్తోంది. మొత్తం 15వేల మంది ప్రతినిధులు ప్లీనరీకి హాజరవుతారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. భారత్ జోడో యాత్ర అందించిన జోష్ నేపథ్యంలో ప్లీనరీ సమావేశాలకు ప్రాధాన్యత ఏర్పడింది. తొలి రోజున స్టీరింగ్ కమిటీ భేటీ అయి సీడబ్ల్యూసీ ఎన్నికలు నిర్వహించాలా వద్దా అన్నది నిర్ణయిస్తుందని వర్గాలు పేర్కొన్నాయి. పార్టీలోని ఓ వర్గం ముఖ్యంగా యువనేతలు సీడబ్ల్యూసీ ఎన్నికలను కోరుకుంటున్నట్లు తెలిపాయి. మరోవైపు తొమ్మిది రాష్ట్రాల్లో ఈ ఏడాది జరబోయే అసెంబ్లీ ఎన్నికలపైనా ప్లీనరీ చర్చించనున్నది. చత్తీస్‌గఢ్, రాజస్తాన్ (కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు)లతో పాటు మధ్యప్రదేశ్, కర్ణాటక (కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న రాష్ట్రాలు)లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ కీలక స్థానాలను గెలుచుకోగలిగితే లోక్‌సభ ఎన్నికలకు ఉపయుక్తంగా ఉంటుంది. పార్టీ ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో మాత్రమే అధికారంలో ఉంది. బేధాభిప్రాయాలు, అంతర్గత విబేధాలు పక్కకుపెట్టి ఏకాభిప్రాయంతో ఎన్నికలకు వెళ్లడం మంచిదన్న సీనియర్ల ఆలోచనను పార్టీ ఆచరణలో పెట్టనున్నట్లు వర్గాలు పేర్కొన్నాయి. సీడబ్ల్యూసీలో 25 మంది సభ్యులు ఉంటే కాంగ్రెస్ అధ్యక్షుడు, పార్లమెంటులో పార్టీ నాయకుడు కాకుండా 12 మంది ఎన్నికైన సభ్యులు, 11 నామినేటెడ్ సభ్యులు ఉంటారు. చివరిగా 1997లో కోల్‌కతా సీతారాం కేసరి నేతృత్వంలో సీడబ్ల్యూసీ ఎన్నికలు జరిగాయి. తాజా ప్లీనరీలో కర్ణాటక, చత్తీస్‌గఢ్, తెలంగాణ, రాజస్తాన్, మధ్యప్రదేశ్, మిజోరం, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల అసెంబ్లీకి ఈనెల 27న జరగబోయే ఎన్నికలకు పార్టీ అధిష్ఠానం దిశానిర్దేశం చేయనుంది. త్రిపురలో ఎన్నికలు ముగిసిన విషయం విదితమే. ఎన్నికల సన్నద్ధతతో భాగంగా ఆయా రాష్ట్ర శాఖల్లో అంతర్గత విబేధాల పరిష్కారానికి పార్టీ ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. రాజస్తాన్, మధ్యప్రదేశ్, కర్ణాటక, చత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో పార్టీలో అంతర్గతంగా కమ్ములాటలు జరుగుతున్నాయి. 2024 ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేక ఫ్రంట్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రయత్నించే క్రమంలో ఎదురవుతున్న ఆటంకాల వేళ జరుగుతుండటంతో ప్లీనరీకి ప్రాధాన్యత ఏర్పడింది. విపక్ష కూటమికి కాంగ్రెస్ నాయకత్వాన్ని టీఎంసీ, బీఆర్ఎస్, ఆప్ వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే.

ప్రాంతీయ భాషల్లోనూ తీర్పులు

'న్యూట్రల్ సైటేషన్' ప్రారంభించిన సీజేఐ

న్యూఢిల్లీ: దేశ భాషల్లో సుప్రీంకోర్టు తీర్పులు వెలువడేలా 'న్యూట్రల్ సైటేషన్'కు సర్వోన్నత న్యాయస్థానం శ్రీకారం చుట్టింది. 'తటస్థ అనులేఖనం' (న్యూట్రల్ సైటేషన్)ను భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ గురువరం ప్రారంభించారు. సర్వోన్నత న్యాయస్థానం వెలువరించే తీర్పులన్నీ 'న్యూట్రల్ సైటేషన్ల'తో ఉంటాయని చెప్పారు. సుప్రీంకోర్టు వెలువరించిన దాదాపు 36వేల తీర్పుల్లో న్యూటల్ సైటేషన్స్ ఉంటాయన్నారు. దీనిని హైకోర్టులూ అనుసరిస్తాయని ఆకాంక్షించారు. ఆంగ్లంలో వెలువడే తీర్పులను భారతీయ భాషల్లో అనువదించేలా 'మెషిన్ లెర్నింగ్ టూల్స్' వినియోగించనున్నట్లు తెలిపారు. 2,900 తీర్పులను హిందీలోకి అనువదించినట్లు చెప్పారు. సాంకేతికను వినియోగించి తీర్పులు అనువదించడం కొన్నిసార్లు కష్టమవుతుందని అన్నారు. ఇందుకు ఉదాహరణగా సర్వోన్నత న్యాయస్థానంలో జడ్జిలు 'లీవ్ గ్రాంటెడ్' (సెలవులు మంజూరయ్యాయి) అంటే 'అవకాశ్ ప్రాప్త్ హోగయా' (అవకాశం లభించింది) అని హిందీలో అనువాదం జరిగిందని సీజేఐ చంద్రచూడ్ అన్నారు. ఎలక్ట్రానిక్ సుప్రీంకోర్టు రిపోర్ట్స్ (ఈ-ఎస్‌సీఆర్) ప్రాజెక్టు కింద 34వేల తీర్పులు న్యాయవాదులకు, న్యాయ విద్యార్థులకు, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఈ-ఎస్‌సీఆర్ ప్రాజెక్టును జనవరి 2న సీజేఐ ప్రారంభించిన విషయం విదితమే.

పళనిస్వామికే అన్నాడీఎంకే పగ్గాలు

న్యూఢిల్లీ: అన్నాడీఎంకే పగ్గాలు పళనిస్వామికే చెందుతాయని సుప్రీంకోర్టు కీలకతీర్పును వెల్లడించింది. ఈవిషయంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. గతేడాది జులై 11న జరిగిన ఏఐఏడీఎంకే జనరల్ కౌన్సిల్ సమావేశం చెల్లుబాటవుతుందని వెల్లడించింది. దీంతోపాటు, అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ఎడప్పాడి కె.పళనిస్వామి (ఈపీఎస్)ని కొనసాగించాలన్న నిర్ణయాన్ని కూడా కోర్టు సమర్థించింది. మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఓ పన్నీర్ సెల్వం వేసిన అప్పీల్ పిటిషన్‌ను కూడా సుప్రీంకోర్టు కొట్టివేసింది. సుప్రీంకోర్టు తీర్పుతో పన్నీర్‌సెల్వం వర్గానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. అమ్మ జయలలిత వారసత్వం తమకే చెందుతుందని పళనివర్గం వాదిస్తోంది. గత కొద్దినెలల నుంచి అన్నాడీఎంకే పన్నీర్ , పళనిస్వామి వర్గాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. సుప్రీంకోర్టు తీర్పుతో అన్నాడీఎంకే కంట్రోల్ మొత్తం పళనిస్వామి చేతి లోకి వెళ్లిపోయింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పదవిలో పళనిస్వామి కొనసాగుతారు. ఏఐఏడీఎంకే జనరల్ కమిటీపై ఓ.పన్నీర్ సెల్వం అప్పీలు చేసిన కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. దినేష్ మహేశ్వరి, హృషికేశ్ రాయ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం (ఫిబ్రవరి 23) తీర్పు వెలువరించింది. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం చెన్నై లో ఈపీఎస్ వర్గానికి చెందిన మద్దతుదారులు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. డప్పుల మోతలకు అనుగుణంగా మద్దతుదారులు బాణాసంచా కాల్చి నృత్యాలు చేశారు. జూలై 11న అన్నాడీఎంకే జనరల్ కౌన్సిల్ ఎడప్పాడి కె పళనిస్వామిని పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా నియమించిన సంగతి తెలిసిందే. సమావేశంలో కోఆర్డినేటర్, కో-ఆర్డినేటర్ పోస్టులను కూడా రద్దు చేశారు. అంతకుముందు కోఆర్డినేటర్‌గా ఓ పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) ఉన్నారు.

అన్నాడీఎంకేలో ఓ.పన్నీర్ సెల్వం సమన్వయకర్తగా, ఎడప్పాడి పళనిస్వామి కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తుండగా, నాయకత్వ వివాదం గతేడాది జూన్‌లో మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో పన్నీర్‌సెల్వం, పళనిస్వామి మధ్య వాగ్వాదం నెలకొనడంతో గతఏడాది జులై 11న అన్నాడీఎంకే సాధారణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ఎడప్పాడి పళనిస్వామిని ఎంపిక చేశారు. తర్వాత ఓ.పన్నీర్‌సెల్వం సహా ఆయన మద్దతుదారులను పదవి నుంచి వేగంగా తొలగించారు.

ఐఎండీబీ యాప్ నుంచి 'పాపులర్ ఇండియన్ సెలబ్రిటీస్ ఫీచర్'

ముంబై: చలనచిత్రాలు, టీవీ షోలు, సెలబ్రిటీల గురించిన సమాచారం కోసం ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన, విశ్వసనీయ సంస్థ అయిన ఐఎండీబీ యాప్ (http://www.IMDb.com) గురువారం పాపులర్ ఇండియన్ సెలబ్రిటీస్ ఫీచర్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. భారతీయ చలనచిత్రాలు, వెబ్ సిరీస్‌లలో ట్రెండింగ్ స్టార్‌లు, చిత్రనిర్మాతలను ట్రాక్ చేయడానికి అభిమానులకు ఇది ఒక సరికొత్త మార్గం. ఆండ్రాయిడ్, ఐఓఎస్ కోసం ఐఎండీబీ యాప్‌లో ప్రత్యేకంగా అందుబాటులో ఉన్న ఈ పాపులర్ ఇండియన్ సెలబ్రిటీస్ ఫీచర్, ప్రతి వారం టాప్ ట్రెండింగ్ ఇండియన్ ఎంటర్‌టైనర్‌లు, ఫిల్మ్‌మేకర్‌లను హైలైట్ చేస్తుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఐఎండీబీకి 200 మిలియన్లకు పైగా ఉన్న నెలవారీ సందర్శకులపై ఆధారపడి ఉంటుంది. ఈ ఫీచర్ ద్వారా ప్రతివారం సెలబ్రిటీస్ ఎవరు ట్రెండ్ అవుతున్నారో చూసి అభిమానులు తమకు ఇష్టమైన ఎంటర్ టైనర్స్ ను ఫాలో అవుతూ, కొత్త టాలెంట్ ను కనిపెట్టవచ్చు. ఐఎండీబీ ఇండియా హెడ్ యామిని పటోడియా దీని గురించి మాట్లాడుతూ... ప్రపంచంలో తమకున్న ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకుని వారిలోని ఆసక్తిని గమనించడంలో ఐఎండీబీ ప్రత్యేక స్థానం పొందిందని అన్నారు. పాపులర్ ఇండియన్ సెలెబ్రిటీస్ ఫీచర్... తాజాగా విడుదల అయిన చిత్రాలు, వివిధ వార్తా సంఘటనల ఆధారంగా అద్భుత కెరీర్ మూవ్‌మెంట్ ఉన్న సెలబ్రిటీలను హైలైట్ చేస్తుందని తెలిపారు.

గాయని నేహా సింగ్‌కు యూపీ పోలీసుల నోటీసులు

లక్నో: భోజ్‌పురి జానపద గాయని నేహా సింగ్ రాథోడ్‌కు ఉత్తరప్రదేశ్ పోలీసులు నోటీసులిచ్చారు. ఉత్తర ప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని పాడిన పాటకు గాను ఈ నోటీసులను యూపీ పోలీసులు జారీచేశారు. బీహార్‌కు చెందిన నేహా సింగ్ భోజ్‌పురి జానపద గాయనిగా ప్రాచుర్యం పొందారు. అనేక ప్రైవేటు పాటల్ని సామాజిక మాధ్యమాల్లో విడుదల చేస్తూ జనాదరణ పెంచుకున్నారు. యూపీ ఎన్నికల సందర్భంగా 'యూపీ మే కా బా (యూపీలో ఏం ఉంది)' అన్న పాటను విడుదల చేశారు. ఆపై 'గుజరాత్ మే కా బా' అంటూ మరో పాటను విడుదల చేశారు. ఈ పాటల్లో ఆయా రాష్ట్రాల రాజకీయ పరిస్థితులను విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన లఖీంపూర్ ఖేరి హింస, హత్రాస్ అత్యాచార ఘటన, బుల్డోజర్ డ్రైవ్ వంటి అంశాలను తన పాటలో ప్రస్తావించింది. బుల్డోజర్ కూల్చివేతలో భాగంగా తల్లీ కూతురు మరణించడం గురించీ పాడారు. దీంతో యూపీని కించపరిచేలా, విద్వేషాలు రెచ్చగొట్టేలా పాటలు ఉన్నాయంటూ రాష్ట్ర పోలీసులు నేహా సింగ్‌కు నోటీసులిచ్చారు. సీఆర్‌పీసీ సెక్షన్ 160 కింద నోటీసులు జారీ చేశారు. అందులో కొన్ని ప్రశ్నలు సంధించి వాటికి సమాధానాలివ్వాలని ఆదేశాలిచ్చారు.

నన్నెవరూ ఆపలేరు: నేహా సింగ్

యూపీ పోలీసులు నోటీసులు ఇవ్వడంపై నేహా సింగ్ స్పందిస్తూ తనను ఎవరూ ఆపలేరని అన్నారు. 'యూపీ పోలీసులు మంగళవారం రాత్రి 8 గంటలప్పుడు కాన్పూర్ రూరల్‌లోని ఇంద్రపురి కాలనీలోగల ఇంటికి వచ్చారు. నోటీసు ఇచ్చి మూడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నా కుటుంబానికి సూచించారు. నా పాట సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టినట్లు ఆరోపించారు. కానీ వారు అర్థం చేసుకోని విషయమేమంటే నేను జానపద గాయనిని... నన్నెవరూ ఆపలేరు. ఉత్తరప్రదేశ్‌లో ఉన్నది బీజేపీ ప్రభుత్వం కాబట్టి వారి చర్యలనే ప్రశ్నిస్తాను కదా! అధికారంలో సమాజ్‌వాదీ పార్టీ ఉంటే వారినే ప్రశ్నించేదాన్ని' అని నేహా అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఖండన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రముఖ జానపద గాయని నేహా సింగ్‌కు యూపీ పోలీసులు నోటీసులివ్వడం ఆమె గొంతు నొక్కే కుట్రలో భాగమని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి పేర్కొంది. ఆమెకు నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించింది. ఇప్టా, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ పజానాట్యమండలి అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.చంద్రానాయక్, చిన్నం పెంచలయ్య, ఇప్టా జాతీయ కార్యదర్శి గని గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టవిరుద్ధమైన నోటీసును తక్షణమే ఉపసంహరించుకోకుంటే దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కవులు, కళాకారులు, రచయితలపై అక్కసు వెలగక్కుతూ వారిపైకి పోలీసులను ఉసిగొల్పి ప్రజాస్వామిక గొంతు నొక్కుతోందని బీజేపీ పాలనను విమర్శించారు. యూపీ పోలీసుల చర్య భావప్రకటనా స్వేచ్ఛకు ముప్పుగా అభివర్ణించారు. మార్చి17 నుంచి 19 వరకు డల్తోన్ గంజ్ (జార్ఖండ్)లో 15వ జాతీయ సదస్సు, సాంస్కృతిక ఉత్సవాలు జరగనున్నాయని, వీటికి రాకుండా అడ్డుకునేందుకే నేహా సింగ్‌పై చర్యలకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు. నేహా సింగ్ విషయంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ద్వారా వినతులు అందజేస్తామన్నారు.

తెలుగు సినిమా గర్వించే క్షణం: చిరంజీవి

హైదరాబాద్: టాలీవుడ్ స్టార్ హీరో రాంచరణ్ పాపులర్ అమెరికన్ టీవీ షో గుడ్ మార్నింగ్ అమెరికా లో సందడి చేసిన విషయం తెలిసిందే. తన కుమారుడికి తెలుగు సినీ పరిశ్రమ తరపున అత్యంత అరుదైన అవకాశం రావడంతో భావోద్వేగానికి లోనయ్యాడు మెగాస్టార్ చిరంజీవి. ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ.. తెలుగు, భారతీయ సినిమా గర్వించే క్షణం... రాంచరణ్ గుడ్ మార్నింగ్ అమెరికా షోలో కనిపించడం గొప్ప విషయం. ఒక ఉద్వేగభరితమైన ఆలోచన, శక్తి దార్శనికుడి లో పుట్టిన తీరు అద్భుతం... అంటూ తన అభిప్రాయాన్ని ట్వీట్ ద్వారా వ్యక్తపర్చారాయన. తెలుగు సినీ పరిశ్రమ నుంచి ఇప్పటివరకు ఎవరికీ రాని అరుదైన అవకాశం అందుకున్నాడు రాంచరణ్. టీవీ షోలో పాల్గొన్న సందర్భంగా న్యూయార్క్‌లోని టైమ్ స్క్వేర్ వీధుల్లో అభిమానులు, ఫాలోవర్లతో కలిసి సెల్ఫీలు, ఫొటోలు దిగాడు రాంచరణ్. ఈ ఫొటోలు ఇప్పటికే నెట్టింట్లో ట్రెండింగ్ అవుతున్నాయి. రాంచరణ్ మరోవైపు ఫిబ్రవరి 24న యూఎస్‌లో జరుగబోయే ఆరవ వార్షిక హెచ్‌సీఏ ఫిల్మ్ అవార్డ్స్ ఈవెంట్‌లో కూడా సందడి చేయబోతున్నాడు. ఈ స్టార్ హీరో ఈవెంట్‌లో వన్ ఆఫ్ ది ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్నాడు. అమెరికన్ యాక్టర్లు బ్రండోన్ పెరెరా, డేవిడ్ దస్త్‌మాల్చియాన్, మేడ్‌లిన్ క్లైన్, ట్రినిటీ జో-లీ బ్లిస్, వయోలెట్ ఎంసీగ్రాతో కలిసి పాపులర్ హెచ్‌సీఏ ఫిల్మ్ అవార్డుల్లో సందడి చేయబోతున్నాడు రాంచరణ్.

నా కల నెరవేరుతోంది: సాయిధరమ్

హైదరాబాద్: స్టార్ హీరో పవన్ కల్యాణ్... తమిళంలో విజయవంతమైన సినిమా 'వినోదయ సితం' తెలుగు రీమేక్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో సాయిధరమ్ తేజ్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఈ సినిమా చిత్రీకరణకు తాజాగా శ్రీకారం చుట్టారు. మాతృకకు దర్శకత్వం వహించిన సముద్రఖని తెలుగులోనూ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా చిత్రబృందంతో కలిసి ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ తన సంతోషాన్ని పంచుకున్నారు హీరో సాయిధరమ్ తేజ్. ఆయన స్పందిస్తూ...'నా జీవితానికి గురువుగా భావించే పవన్ కల్యాణ్ గారితో కలిసి నటించాలనే కల ఈ సినిమాతో తీరుతున్నందుకు ఆనందంగా ఉంది. సెట్స్‌లో అడుగుపెట్టే రోజు కోసం వేచి చూస్తున్నా' అని పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మిస్తోంది. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత కాగా వివేక్ కూచిబొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫాంటసీ కామెడీ డ్రామా కథతో తమిళంలో మంచి విజయాన్ని సాధించిందీ చిత్రం. తెలుగు రీమేక్‌లో మన నేటివిటీతో పాటు పవన్ ఇమేజ్‌కు తగినట్లుగా మార్పులు చేసినట్లు సమాచారం. థమన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు.

'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' నుంచి పాట విడుదల

హైదరాబాద్: నాగశౌర్య కథానాయకుడిగా 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' సినిమా రూపొందింది. విశ్వప్రసాద్ - పద్మజ దాసరి నిర్మించిన ఈ సినిమాకి, అవసరాల శ్రీనివాస్ దర్శకత్వం వహించాడు. టైటిల్‌ను బట్టి ఇది ప్రేమకథ అనే విషయం అర్థమవుతూనే ఉంది. పెద్దలతో ముడిపడిన ప్రేమకథ కావడం వలన ఇది ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని కూడా చెప్పచ్చు.

మాళవిక నాయర్ కథానాయికగా నటించిన ఈ సినిమా నుంచి తాజాగా ఒక లిరికల్ వీడియో సాంగ్ ను విడుదల చేశారు. 'కనులచాటు మేఘమా కాస్త ఆగుమా .. వెనుకరాని నీడతో రాయబారమా' అంటూ ఈ పాట సాగుతోంది.

లేపాక్షి ఎగ్జిబిషన్ కమ్ సేల్

హస్తకళలు మరియు చేనేత వస్త్రముల ప్రదర్శన- అమ్మకాలు

డి.సి.ఎమ్.ఎస్.గ్రౌండ్, లేపాక్షి షోరూమ్ ప్రక్కన, నాగమల్లితోట జంక్షన్, కాకినాడ

తేది : 17-2-2023 నుండి 26-2-2023

సమయం : ఉ.10 గం॥ల నుండి రాత్రి 9 గం॥ల వరకు

హస్త కళా వస్తువులు: కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, బంజారా & క్రోచెట్ లేస్, ఆర్టిఫిషియల్ జ్యువెలరీ, మెటల్ కాస్టింగ్స్, బొబ్బిలి వీణలు, కలంకారి పెయింటింగ్స్, మదనపల్లి పాటరీ, జ్యూట్ బ్యాగ్స్, ఉదయగిరి ఉడ్ కార్వింగ్, లెదర్ వేర్ & కాటన్ దర్రీస్, ఒలెన్ కార్పెట్స్, సెరామిక్ ఐటమ్స్, హైదరాబాద్ పెరల్స్, ఇంకా మరెన్నో...

కళాత్మక వస్త్రములు: చీరలు/డ్రెస్ మెటీరియల్, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, ధర్మవరం, సిద్దిపేట, నారాయణపేట, చీరాల,కలంకారి, బాటిక్ ప్రింటింగ్, బెంగాలి కాటన్, నారాయణవరం, గాగ్రాచోళి, కాటన్ ప్రింటెడ్, అప్లిక్ వర్క్, ప్యాచ్‌వర్క్ మరియు ఖాదీ మెటీరియల్, బెడ్‌షీట్స్ ఇంకా మరెన్నో...

హస్త కళా వస్తువులు, చేనేతలను కొనుగోలు చేయండి... కళాకారులకు చేయూతనీయండి...

Sponsored by: Development Commissioner (Handicrafts) Ministry of Textiles, Govt. of India, New Delhi

Organized by: A.P.Handicrafts Devp.Corp. Ltd., (Govt. of A.P. Undertaking) Nagamalli Thota Jn., Kakinada-5 Ph : 0884-2377789

నటనకు అందుకే దూరమయ్యా: జెనీలియా

హైదరాబాద్: తెలుగులో కొన్నేళ్ల పాటు స్టార్ హీరోయిన్‌గా వెలిగింది జెనీలియా. ఆమె పేరు చెబితే 'బొమ్మరిల్లు' నాయిక 'హాసిని' గుర్తొస్తుంది. రితేష్‌తో పెండ్లి తర్వాత పూర్తిగా వ్యక్తిగత జీవితానికే సమయం కేటాయించింది. భర్త రితేష్‌తో కలిసి ఆమె ఇటీ వల 'వేద్' అనే చిత్రంలో నటించింది. వేద్ ఘన విజయం సాధించి జెనీలియా నటనకు మంచి పేరు తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో జెనీలియా మాట్లాడుతూ 'జీవితంలో ఒకటి కావాలంటే మరొకటి వదిలేయాల్సిందే. రెండు పడవల మీద ప్రయాణం సాగదు. పెండ్లయ్యాక వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించా. సినిమాలు చేస్తూ ఇంటిని చూసుకోవడం కుదరలేదు. అందుకే సినిమాలు వదిలేశా. అలా చేయడం వల్లే ఇవాళ ఒక మంచి ఇల్లాలిగా కుటుంబంలో పేరు తెచ్చుకున్నా అని చెప్పింది.

ఉమేశ్ ఇంట విషాదం

నాగ్‌పూర్: టీమిండియా క్రికెటర్ ఉమేశ్ యాదవ్ ఇంట్లో విషాదం నెలకొంది. ఆయన తండ్రి తిలక్ యాదవ్ (74) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ ఆడుతున్న సమయంలో ఉమేశ్ యాదవ్ ఇంట్లో ఈ దుర్ఘటన చోటు చేసుకోవడంతో క్రికెట్ అభిమానులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఉమేశ్ యాదవ్ తండ్రి తిలక్ యాదవ్ చాలా నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇటీవల ఆయన పరిస్థితి విషమించడంతో నాగ్‌పూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కొద్దిరోజులు చికిత్స అందించారు. కానీ పరిస్థితి మెరుగుపడలేదు. రోజురోజూ ఆరోగ్యం క్షీణిస్తుండటంతో ఇంటికి తీసుకెళ్లమని వైద్యులు సూచించారు. దీంతో కాపరెడాలోని మిలన్ చౌక్‌లో నివాసానికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఆయన కన్నుమూశారు. 2010లో టీమిండియా జట్టులోకి ఎంట్రీ ఇచ్చిన ఉమేశ్ యాదవ్.. పేసర్‌గా ఎదిగాడు. అయితే కొంతకాలంగా ఆయన టెస్ట్ క్రికెట్‌కే పరిమిమయ్యాడు. తాజాగా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో టెస్ట్ మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. కానీ తొలి రెండు మ్యాచ్‌ల్లో ఉమేశ్ యాదవ్ రిజర్వు బెంచ్‌కే పరిమితమయ్యాడు.

'సన్‌రైజర్స్ హైదరాబాద్' కొత్త కెప్టెన్ మార్‌క్రమ్

హైదరాబాద్: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కొత్త కెప్టెన్ వచ్చాడు. జట్టు సారథ్య బాధ్యతలను దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ ఏడెన్ మార్‌క్రమ్‌కు అప్పగిస్తూ జట్టు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఫ్రాంచైజీ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. అయితే హైదరాబాద్ జట్టుకు విదేశీ ఆటగాళ్లు నాయకత్వం వహించడం ఇదే మొదటి సారి కాదు. గతంలో కొన్నే ళ్ల పాటు ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ డేవిడ్ వార్నర్, కేన్ విలియమ్ సన్ కెప్టెన్‌గా వ్యవహరించారు. ఇక మధ్యలో కొన్ని సార్లు భువనేశ్వర్ కుమార్ కెప్టెన్ బాధ్యతలు నిర్వర్తించాడు. కాగా, ఇటీవల జరిగిన ఐపీఎల్ మినీ వేలంలో హైదరాబాద్ జట్టు... మాజీ కెప్టెన్లు డేవిడ్ వార్నర్, కేన్ విలియమ్సన్ రిలీజ్ చేసింది. దీంతో ఆ జట్టు సారథి ఎవరు అనేది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యం లో మార్‌క్రమ్ లేదా టీమిండియా ఓపెనర్ మయాంక్ అగర్వాల్‌కు కెప్టెన్సీ అప్పగిస్తారని చర్చ జరిగింది. చివరకు మార్‌క్రమ్‌కు అవకాశం దక్కింది. అయితే మార్‌క్రమ్ ఇదివరకే సన్‌రైజర్స్ యాజమాన్యానికి చెం దిన అనుబంధ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టుకు సారథ్యం వహించాడు. ఇటీవల జరిగిన ఎస్‌ఏ20 (ఫ్రాంచైజీ క్రికెట్ టోర్నీ)టోర్నీలో ఈ జట్టు విజయం సాధించింది.

రోహిత్‌శర్మ పొట్ట తగ్గించుకోవాలి: కపిల్‌దేవ్

న్యూఢిల్లీ: భారత దిగ్గజ క్రికెటర్, 1983 వన్డే ప్రపంకప్ గెలుచుకున్న భారత్‌జట్టు కెప్టెన్ కపిల్ దేవ్... ఈ మధ్య వివాదాస్పద వ్యాఖ్యలతో నిత్యం వార్తల్లో నిలుస్తున్నాడు. ఫామ్‌లో లేని విరాట్ కోహ్లీ కంటే కుర్రాళ్లకు టీ20 వరల్డ్ కప్ 2022 టోర్నీలో చోటు ఇవ్వాలని సంచలన వ్యాఖ్యలు చేసిన కపిల్ దేవ్, ఇప్పుడు రోహిత్ శర్మ లక్ష్యంగా వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ ఫిట్‌నెస్ గురించి ఎన్నో ఏళ్లుగా చర్చ నడుస్తూనే ఉంది. రోహిత్ బ్యాటింగ్‌లో విఫలమైన ప్రతీసారీ 'వడాపావ్' పేరుతో సోషల్ మీడియాలో ట్రోల్స్ తెగ వైరల్ అవుతూనే ఉన్నాయి. తాజాగా టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ కూడా రోహిత్ ఫిట్‌నెస్ గురించి సంచలన వ్యాఖ్యలు చేశాడు. 'క్రికెటర్ అనే ప్రతీ ఒక్కరికీ ఫిట్‌గా ఉండడం చాలా అవసరం. ముఖ్యంగా కెప్టెన్ చాలా ఫిట్‌గా ఉండాలి. అప్పుడే మిగిలిన వాళ్లు ఫిట్‌నెస్‌ని సీరియస్‌గా తీసుకుంటారు. రోహిత్ శర్మ ఈ విషయంలో చాలా కష్టపడాలి. అతను చాలా గొప్ప బ్యాట్స్‌మన్. అయితే అతని ఫిట్‌నెస్ గురించి మాట్లాడితే... తను అధిక బరువు ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. కనీసం టీవీల్లో అయినా ఫిట్‌గా కనిపించాలి కదా...టీవీల్లో చూసేదానికి, బయట చూసేదానికి చాలా తేడా ఉంటుంది.

అయితే రోహిత్‌ని ఆ పొట్టతో టీవీల్లో అస్సలు చూడలేకపోతున్నాం. అతను గొప్ప ప్లేయర్, గొప్ప కెప్టెన్... అయినా కూడా ఫిట్‌నెస్ సాధించి తీరాల్సిందే... విరాట్ కోహ్లీనే చూడండి. అతన్ని చూసిన ప్రతీసారీ ఫిట్‌గా హెల్తీగా కనిపిస్తాడు. క్రికెటర్లు అలా ఉండాలి... అలా ఉంటేనే వికెట్ల మధ్య చిరుతల్లా పరుగెత్తగలరు.' అని వ్యాఖ్యానించాడు.

ఆసీస్ వన్డే జట్టులోకి మ్యాక్స్‌వెల్, మార్ష్

ముంబై: భారత్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్ కోసం ఆస్ట్రేలియా 16మంది సభ్యులతో వన్డే జట్టును ప్రకటించింది. పేస్ బౌలర్ రయి రిచర్డ్‌సన్‌తో పాటు గ్లెన్ మ్యాక్స్‌వెల్, మిచెల్ మార్ష్‌లు తిరిగి జట్టులో చేరనున్నారు. వన్డే జట్టుకు కెప్టెన్‌గా ప్యాట్ కమ్మిన్స్ బాధ్యతలు నిర్వర్తించనుండగా, వార్నర్, స్మిత్, లబుషేన్ కూడా జట్టుకు అందుబాటులో ఉండనున్నారు. ఆసీస్ చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిల్... ఆస్ట్రేలియా వన్డే జట్టు వివరాలను వెల్లడించారు. ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ నేపథ్యంలో తమ జట్టుకు మంచి ప్రాక్టీస్ అవుతుందని అన్నారు. ఈ ఏడాదిలోనే ఇండియాలో ప్రపంచకప్ జరగనున్న విషయం తెలిసిందే. అక్టోబర్‌లో జరిగే ఆ టోర్నీ కోసం తమ జట్టు సంసిద్ధం అవుతోందన్నారు. ఆసీస్ జట్టులో చాల మంది ఆటగాళ్లు గాయాలతో బాధపడుతున్నారు. అయినా కొందర్ని వన్డే సిరీస్‌కు ఎంపిక చేయడం గమనార్హం. ఇటీవల గాయంతో టెస్టు జట్టు నుంచి వైదొలిగిన సీమ్ బౌలర్ జోష్ హేజల్‌వుడ్ కూడా వన్డే జట్టులో ఉన్నాడు. మార్చి 17వ తేదీన ముంబైలో ఆసీస్, ఇండియా మధ్య తొలి వన్డే జరగనున్నది. వైజాగ్‌లో మార్చి 19వ తేదీన రెండవ, చెన్నైలో మార్చి 22వ తేదీన మూడో వన్డే మ్యాచ్ జరుగనున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.